thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 52 | జగిత్యాల | గురువారం | 14 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

విరాట్ కోహ్లీ విశ్వరూపం




11

# బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్



## పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

2

## ఆధారాలతో రేపు వస్తా

పోలీసులకు బండి భగీరథ్ లేఖ

## నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం

**హైదరాబాద్, మే 13:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి.

మిగతా 2 లో

## బండి భగీరథ్‌కు లుక్ అవుట్ నోటీసులివ్వాలి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

3






తప్పు చేస్తే ఎంతటివారైనా

## శిక్షార్హులే

3

బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు

మంత్రి సీతక్క స్పష్టీకరణ

## అరెస్ట్ తప్పదు

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



## చమురు సంక్షోభం పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన మోడీ
- రెండు కార్లతో ఢిల్లీ వీధుల్లో ప్రధాని పయనం
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- రాష్ట్రాల సీఎంల కాన్వాయ్‌ల కుదింపు

4

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం

ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

వివరాలు 4వ పేజీలో

# ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌కు ఓఆర్ఆర్‌లు

## విమానాశ్రయాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం

- ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు..
- ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు
- నల్గొండ - యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్
- మెగా గ్రోత్ కారిడార్‌పై ముఖ్యమంత్రి సమీక్ష..





**హైదరాబాద్, మే 13 :** తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో వెలుపలి వలయ రహదారుల (ఓఆర్ఆర్) నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చజెండా ఊపారు. రాష్ట్రంలో ఏర్పాటు కాబోయే కొత్త విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మెగా గ్రోత్ కారిడార్‌పై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ, పట్టణాల కేంద్రంగానే సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో అత్యాధునిక సాంకేతికతను జోడించాలని సూచించారు. అండర్ డ్రైనేజీల నిర్మాణానికి నూతన సాంకేతికతను వాడుకోవాలని, అవసరమైన చోట ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఖర్చు తగ్గించేందుకు వీలుగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని, ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసి పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే అభివృద్ధి పనులకు వెచ్చించాలని వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక, ఆధ్యాత్మిక రంగాన్ని ప్రోత్సహించేందుకు పలు కారిడార్లను రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, అలాగే ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ - భూత్పూర్ - జడ్చర్ల మరియు కొత్తగూడెం - పాల్వంచ - సుజాతనగర్‌లను కలుపుతూ ప్రత్యేక కారిడార్లను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనులు సాగుతాయని, వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మిగతా 2 లో

## హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పోరేట్ ఆఫీస్

సీఎంతో సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ



2

## బలపరీక్షలో నెగ్గిన సీఎం విజయ్



4

ఓటింగ్‌ను బహిష్కరించిన డీఎంకే..

మద్దతుగా అన్నాడీఎంకే రెబల్ వర్గం



ప్రేమ, పెళ్లి పేరుతో

## మోసం

మహిళా కానిస్టేబుల్‌ను వంచించిన ఎస్ఐ

కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్

.. వివరాలు 2లో



## బక్రీద్ వేళ పకడ్బందీ నిఘా

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

డీజీపీ సీవీ ఆనంద్

.. వివరాలు 2లో



## నీట్ పేపర్ లీక్‌లో సీబీఐ దూకుడు


దేశంలో ఏకకాలంలో సోదాలు

ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన

2

రైతుల ఖాతాల్లోకి

## 4,520 కోట్లు



30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల శాఖ అధికారుల వెల్లడి

2

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్



వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ట్వీట్

ఏడీఆర్ నివేదికను ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు

.. వివరాలు 2లో



## లిఫ్ట్‌లో చిన్నారి మృత్యువాత

నుజ్జునుజ్జు అయిన తల

.. వివరాలు 2లో

చురకలు

గురువారం 14 మే 2026




# బండి భగీరథ్ అప్‌స్కాండింగ్

**నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం**

**హైదరాబాద్, మే 13:** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బండి భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని.. అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తనపై లైంగిక దాడి చేశాడంటూ భగీరథ్‌పై బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందిస్తూ.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. దీంతో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు తనకు ముందుస్తు బెయిల్ ఇవ్వాలంటూ భగీరథ్.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# విచారణకు భగీరథ్ గైర్హాజరు

**హైదరాబాద్, మే 13:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (ఠి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

# రేపు ఆధారాలతో వస్తా

**పోలీసులకు బండి భగీరథ్ లేఖ**

**హైదరాబాద్, మే 13:** పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

**మహిళా కానిస్టేబుల్‌ను వంచించిన ఎస్ఐ**

**కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్**



**హైదరాబాద్, మే 13:** మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో ఓ ఎస్సై మోసం చేశాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాక ఉన్నతాధికారులు సదరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రేమిస్తున్నాను అంటూ నమ్మించి.. పెళ్లి పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతిని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదు కావటంతో.. ఈ నిర్ణయం తీసుకున్నారు ఉన్నతాధికారులు. పూర్తి వివరాల్లోకి వెళితే..2ㆍ18 బ్యాచ్ ఎస్సై సురేష్ కుమార్.. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతితో పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో.. ఎస్సై సురేష్ కు దగ్గరైంది ఆ మహిళా కానిస్టేబుల్. కొన్నాళ్లుగా పెళ్లి విషయంపై ఒత్తిడి చేస్తుంది. సాకులు చెబుతూ.. పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నారు ఎస్సై సురేష్ కుమార్. పెళ్లి వాయిదాపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే పెళ్లి చేసుకోవాలని మహిళా కానిస్టేబుల్ పట్టుబట్టింది. పెళ్లి విషయంలో ఎస్సై సురేష్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో.. మహిళా కానిస్టేబుల్ గట్టిగా నిలదీసింది. పెళ్లి చేసుకునేది లేదని.. పెళ్లి చేసుకోవటం కుదరదు అని తేల్చి చెప్పారు ఎస్సై సురేష్. ఈ క్రమంలోనే ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసినట్లు కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసింది మహిళా కానిస్టేబుల్. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్సై సురేష్ ను విచారించేందుకు ప్రయత్నించారు. అతని సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ లో ఉండటంతో.. విచారణకు స్పందించకపోవటం.. అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో.. ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. బాధితురాలు మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఆధారాలతో పోలీస్ ఉన్నతాధికారులు అతణ్ని సస్పెండ్ చేశారు.

# హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

**ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పొరేట్ ఆఫీస్**

**సీఎంతో సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ**



**హైదరాబాద్, మే 13:** హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 6ㆍㆍ మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# నీట్ పేపర్ లీక్‌లో సీబీఐ దూకుడు

**దేశంలో ఏకకాలంలో సోదాలు**

**ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన**



**న్యూఢిల్లీ, మే 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2ㆍ26 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు. సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గడ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. ఢిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# బక్రీద్ వేళ పకడ్బందీ నిఘా

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు**

**రాష్ట్రవ్యాప్తంగా 203 చెక్ పోస్టుల ఏర్పాటు..**

**సరిహద్దుల్లో సిబ్బందితో తనిఖీలు ముమ్మరం**

**డీజీపీ సీవీ ఆనంద్**



**హైదరాబాద్, మే 13:** ఈ నెల 27న జరగనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-196ㆍ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2ㆍ3 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. రానున్న 15 రోజుల్లో పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రవాణా చేసే పశువులకు సంబంధించి వెటర్నరీ డాక్టర్ల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, పశు సంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని డీజీపీ తెలిపారు. సీజ్ చేసిన పశువుల కోసం తగిన సౌకర్యాలతో 'క్యాటిల్ పౌండ్‌లను' సిద్ధం చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడుతూ, సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలు మీరే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని డీజీపీ హెచ్చరించారు.

# రైతుల ఖాతాల్లోకి 4,520 కోట్లు

**30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు**

**పౌరసరఫరాల శాఖ అధికారుల వెల్లడి**

**హైదరాబాద్, మే 13:** 2ㆍ25-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 3ㆍ లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ. 4,52ㆍ కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ల్గ÷తులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ÷-రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,35ㆍ కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలతో కూడిన సుమారు 11,5ㆍㆍ రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి, భారీగా వస్తున్న ధాన్యాన్ని సజావుగా నిర్వహించడానికి, రైతుల ప్రయోజనాలను కాపాడుతూ కొనుగోళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు, గోదాములలో ధాన్యం నిర్వహణ ఛార్జీలను అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17/- కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాలతో రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తోంది. ల్గ÷తులు తమకు ఏవైనా సందేహాలు, సమస్యలు ఉన్నా లేదా సహాయం కావాలన్నా పౌరసరఫరాల శాఖకు చెందిన టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1967 ను సంప్రదించాలని తెలిపింది.

# లిఫ్ట్‌లో చిన్నారి మృత్యువాత

**గచ్చిబౌలి హాస్టల్‌లో ఐదేళ్ల చిన్నారి మృతి**

**హైదరాబాద్, మే 13:** గచ్చిబౌలిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్టులో ఇరుక్కుని మరో చిన్నారి మృత్యువాత పడింది. గౌలిదొడ్డిలోని ఒక ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో ఓ బాలిక లిఫ్ట్‌లో ఇరుక్కుని మృతి చెందింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి.. గౌలిదొడ్డిలోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి బిస్తు గోష్, స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఆ చిన్నారి గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఐదో అంతస్తుకు వెళ్తున్న క్రమంలో.. మూడవ అంతస్తు వద్ద చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్లలో ఇరుక్కుపోయింది. అది గమనించేలోపే లిఫ్ట్ కదలడంతో.. చిన్నారి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 1ㆍㆍకు కాల్ చేయగా.. పోలీసులు, హైడ్రా, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి మృతదేహాన్ని అత్యంత శ్రమతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందా? అనే కోణంలో విచారణ సాగుతోంది. ఐదేళ్ల చిన్నారి కళ్లముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- భ రథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ

**మహబూబాబాద్, మే 13:** భ రథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భ రథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భ రథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భ రథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భ రథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తో పాటు భ రథ్ ఓ లేఖ పంపించారు.



# బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

- ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్, మే 13:** పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భ రథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భ రథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భ రథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భ రథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఃూఎఖీతో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.



# బండి భు రథ్‌కు లుక్ అవుట్ నోటీసులివ్వాలి

**పొదుపు సూత్రాలు తెలంగాణకు**

**నిధులు మాత్రం ఆంధ్రాకా?**

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, మే 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.



# అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు పురస్కారం

**నేడు మంత్రి పొన్నం చేతుల మీదుగా అందచేత**

**హైదరాబాద్, మే 13:** రాష్ట్రంలోని బీసీ గురుకుల, బీసీ హాస్టల్‌లో ఉంటూ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకుఈనెల 14న ప్రతిభా పురస్కారాలు అందిస్తుందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రతిభావంతులైన 508 మంది విద్యార్థులను సన్మానిస్తామన్నారు. పదో తరగతి ఫలితాలలో మహాత్మా జ్యోతిభా ఫూలే నుంచి 147 మంది విద్యార్థులు (576 కటాఫ్), బీసీ హాస్టల్ విద్యార్థులు 67 మంది (550 కటాఫ్) కి మె-ంత్తం 214 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం 137 మంది విద్యార్థులు (988 కటాఫ్/1000), 28 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 165 మంది విద్యార్థులను సత్కరిస్తామని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (467/437/493 కటాఫ్) సాధించిన 107 మంది విద్యార్థులు, 22 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 129 మంది విద్యార్థులను సన్మానిస్తామని ఆయన తెలిపారు.



# పోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

**ఇది కుల సమస్య కాదని గుర్తించాలన్న గంగుల**

హైదరాబాద్, మే 13: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భ రథ్ విషయంలో బీఆర్ఎస్ బాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు. కాగా బండి సాయి భ రథ్‌పై ఇప్పటికే పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు.. అతడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారని తెలిసిందే. ఇంతకుముందు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో చట్టం, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారి రితిరాజ్‌కు అప్పగించిన నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.






# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

**వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ట్వీట్**

**హైదరాబాద్, మే 13:** తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# విపక్షనేతల అంటే లెక్కలేదా ?

**మోడీ తీరుపై మండిపడ్డ వీహెచ్**



**హైదరాబాద్, మే 13:** మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు

# ఇంటర్ పరీక్ష రాసిన మాజీ మావోయిస్ట్ దేవ్‌జీ



**జగిత్యాల, మే 13:** మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆయన ఈ పరీక్ష రాశారు. 1980-82లో దేవ్‌జీ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తున్న సమయంలో సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన బహిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన.. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో పరీక్ష రాశారు. బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్ష రాశారు. న్యాయవాద కోర్సు చేసి పేదల కోసం పనిచేస్తానని దేవ్‌జీ చెప్పారు.

# సీఎంను కలిసిన ప్రముఖులు

**హైదరాబాద్, మే 13:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో పలువురు ప్రముఖులు కలిశారు. వీరంతా సీఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు, రీజనల్ డైరెక్టర్ జెవి రాజగోపాల్ రావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్ఆర్ బాబులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.





సంపాదకీయం

# ఎన్‌టీఏ వైఫల్యం విద్యార్థులకు శాపం!

కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేందప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది. ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# చమురు సంక్షోభం.. పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన మోడీ
- రెండు కార్లతో ఢిల్లీ వీధుల్లో ప్రధాని పయనం
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- రాష్ట్రాల సీఎంల కాన్వాయ్‌ల కుదింపు



**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ముడి చమురు ధరలపై తీవ్రంగా పడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, దేశీయంగా ఇంధన వినియోగాన్ని తగ్గించి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేవలం పిలుపునివ్వడమే కాకుండా, స్వయంగా తన నుండే ఈ మార్పును ప్రారంభిస్తూ ప్రధాని సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన భద్రత కోసం వినియోగించే కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను ఏకంగా 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని ఎస్‌పీజీని ఆదేశించారు. భద్రతా ప్రోటోకాల్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండానే, ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రధాని ఆదేశాలతో ఎస్‌పీజీ ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణను ప్రారంభించింది. చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో



భాగంగా విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని ప్రధాని నిర్ణయించారు. అయితే, ఇందుకోసం కొత్త కార్లను కొనుగోలు చేయవద్దని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్ వాహనాలనే గరిష్టంగా వినియోగించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడకుండా ఆయన తీసుకున్న ఈ నిర్ణయం చర్చనీయాంశమైంది.

## రెండు కార్లతో మోడీ పయనం

ప్రధాని మోదీ చెప్పినట్లుగానే తన భద్రతా కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను భారీగా తగ్గించారు. ఇంధనం పొదుపుకోసం తన కాన్వాయ్‌లో 50శాతం వాహనాలను తగ్గించాలని ఆదేశించిన కొద్దిగంటల్లో అమలు చేసారు. కేవలం రెండు కార్ల కాన్వాయ్‌తో ప్రయాణం చేస్తున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కేవలం రెండు వాహనాలు మాత్రమే కనిపించడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ వీధుల్లో ప్రధాని కాన్వాయ్ దృశ్యాలు కనిపించాయి. వీటికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

## అమిత్ షా సహా పలువురు సీఎంల బాట

ప్రధాని బాటలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లోని వాహనాలను సగానికి తగ్గించుకున్నారు. కేంద్ర మంత్రులతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు కూడా తమ కాన్వాయ్‌లను కుదించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖలు సైతం ఇంధన పొదుపుపై సమీక్షలు జరుపుతున్నాయి. ముడి చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ప్రస్తుత సంక్షోభం సవాలుగా మారిన తరుణంలో, అగ్రనేతలు తీసుకుంటున్న ఈ పొదుపు చర్యలు సామాన్య ప్రజలకు కూడా ఒక సంకేతాన్ని పంపిస్తున్నాయి. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, ఎంపీ సీఎం మోహన్ యాదవ్‌లతో సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు.

# బంగారం, వెండి ప్రియులకు షాక్

## కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి పెంపు!

### రూపాయి పతనం, చమురు సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కఠిన నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 13:** దేశంలో పసిడి, వెండి ధరలకు మరింత రెక్కలు రానున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 6 శాతంగా ఉన్న మొత్తం దిగుమతి సుంకాన్ని ఏకంగా 15 శాతానికి పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 10 శాతానికి చేరుకోగా, దీనికి అదనంగా 5 శాతం అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను జోడించారు. వెరసి, మొత్తం దిగుమతి సుంకం 15 శాతానికి పెరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో □95.75కి పడిపోవడంతో ప్రభుత్వం ఈ అప్రమత్తత చర్యలు చేపట్టింది. ప్రపంచంలో బంగారం వినియోగంలో భారత్ రెండో స్థానంలో ఉండగా, వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం మనం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. గతేడాది ఈక్విటీ మార్కెట్లలో రాబడులు తగ్గడంతో, పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు గతేడాది కంటే 186 శాతం పెరిగాయి. ఇప్పటికే బంగారం ధరలు గరిష్ఠ స్థాయిల్లో ఉండగా, తాజా సుంకాల పెంపుతో డిమాండ్ మరింత తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. గతంలో ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్‌టీ విధించినప్పుడు బ్యాంకులు నెల రోజుల పాటు దిగుమతులను నిలిపివేయడంతో, ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయాయి. చమురు సంక్షోభం మరియు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ప్రజలు పొదుపు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన మరుసటి రోజే ఈ నిర్ణయం రావడం గమనార్హం.




# బలపరీక్షలో నెగ్గిన టీవీకే ప్రభుత్వం!

## ఓటింగ్‌ను బహిష్కరించిన డీఎంకే..

### మద్దతుగా అన్నాడీఎంకే రెబల్ వర్గం

**చెన్నై, మే 13:** తమిళనాడు సీఎం విజయ్ తన రాజకీయ జీవితంలో మరో కీలక మైలురాయిని అధిగమించారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ఆయన తన బలాన్ని నిరూపించుకుని ప్రభుత్వంపై ఉన్న నీలినీడలను తొలగించారు. మొత్తం 234 స్థానాలున్న అసెంబ్లీలో జరిగిన ఈ బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి మద్దతుగా ఓటు వేయగా, 22 మంది వ్యతిరేకించారు. టీవీకే పార్టీకి సొంతంగా 108 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలు విజయ్‌కు అండగా నిలిచారు. అత్యంత ఆసక్తికరంగా, అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబల్ ఎమ్మెల్యేలు సైతం విప్‌ను ధిక్కరించి విజయ్‌కు అనుకూలంగా ఓటు వేశారు. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే ఈ ఓటింగ్‌ను బహిష్కరిస్తూ సభ నుండి వాకౌట్ చేసింది. డీఎంకేకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభలో లేకపోవడంతో మ్యాజిక్ మార్కు తగ్గింది, ఇది విజయ్ గెలుపును మరింత సులభతరం చేసింది. బలపరీక్షలో నెగ్గిన అనంతరం సీఎం విజయ్ సభలో ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "ప్రజలను నమ్ముకునే మేము ఎన్నికల బరిలోకి దిగామని, అన్ని వర్గాల మద్దతుతో ఐదేళ్ల పాటు



సుస్థిర పాలన అందిస్తామని" ఆయన ధీమా వ్యక్తం చేశారు. లౌకిక విధానాన్ని పాటిస్తూ, మహిళల భద్రత మరియు సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన పునరుద్ఘాటించారు. విమర్శలు ఎదుర్కొన్న ఓఎస్‌డీ రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని సానుకూల నిర్ణయం తీసుకున్నారు. విశ్వాస పరీక్ష సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ టీవీకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. ఇది 'రీల్ ప్రభుత్వం' అని, ఎమ్మెల్యేల కొనుగోళ్లతోనే విజయ్ గట్టెక్కారని ఆరోపించారు. అన్నాడీఎంకే అధినేత పళనిసామి కూడా తమ ఎమ్మెల్యేలకు విజయ్ డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించగా, రెబల్ వర్గం నేత వేలుమణి ఆ ఆరోపణలను తిప్పికొట్టారు. తాము ఎలాంటి పదవులను ఆశించి మద్దతు ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.




# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

## పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ, మే 13:** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ–చికాగో, ముంబై–న్యూయార్క్, ఢిల్లీ–షాంఘై, చెన్నై–సింగపూర్, ముంబై–ఢాకా, ఢిల్లీ–మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది. నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర పర్యటన



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు శుభకార్యాలు, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన ఇమ్మనేని కిరణ్ బాబు–నళిని కుమారి దంపతుల కుమారుని రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్తుపల్లి మండలం బి.గంగారాం జల గంనగర్కు చెందిన ఉప్పుతల నరసింహ–నాగమణి దంపతుల కుమార్తె లక్ష్మీ భవాని–అశోక్ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఇదే సందర్భంగా పెనుబల్లి మండలం విఎం బంజర్ గ్రామానికి చెందిన చలమాల నర సింహారావు–సంధ్యరాణి దంపతుల కుమారుడు అఖిల్ వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వారి నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పేపర్ లీకుల సర్కార్..

## లక్షలాది జీవితాలతో చెలగాటం..!

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఆసిఫాబాద్ టౌన్:** నీట్–యూజీ 2026 పేపర్ లీక్ కుంభకోణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ విమర్శించారు. విద్యార్థుల చెవిపోగులు, క్లిప్పులు తనిఖీ చేసే అధికారులు.. ప్రశ్నపత్రాలను కాపాడలేక పోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ నీట్ విధానం వల్ల కేవలం కోచింగ్ మాఫియా మాత్రమే లాభపడుతోందని, పేద గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు అంధ కారమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా వివాదాలు చెలరేగుతున్నా కేంద్రం బాధ్యత తీసుకోకుండా తప్పు చేసిన అధికారులను కాపాడుతోందని ఆరోపించారు. ఈ స్కాంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న వారిని కఠినంగా శిక్షించాలని సుగుణ డిమాండ్ చేశారు.

# సీఎంకు వివాహ పత్రిక అందజేసిన సాజిద్ ఖాన్



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రముఖులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్లను కలిసి వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా తన కుమార్తె వివాహ వేడుకకు తప్పకుండా హాజరుకావాలని సాజిద్ ఖాన్ కోరగా, రాష్ట్ర నేతలు సానుకూలంగా స్పందించారు. వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తామని హామీ ఇచ్చారు. సాజిద్ ఖాన్ వెంట ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు ఉన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్పర్సన్ దంపతులు



**దిలాబాద్:** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, ఆమె భర్త సతీష్ కుమార్ బుధవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ప్రజలపై శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అలాగే రాబోయే రోజుల్లో జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసి, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, రైతాంగం ఆనందంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ దంపతులు తెలిపారు.

# విద్యారంగ అభివృద్ధిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులు కావాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ టౌన్ :** ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక చర్యలు చేపడుతుందని, స్థానిక సంస్థల ప్రజాప్ర తినిధులు విద్యాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీ బిన్ అహ్మద్ లతో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలపై ఆసిఫాబాద్ నియోజకవర్గ సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంపొందించడం అంశాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదరించడం వలన విద్యార్థుల ప్రవేశాలు పెరిగి చదువు మధ్యలో మానేవేసే పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రతినెల పాఠశాలలను సందర్శించడం, బడి వయసు పిల్లలు ప్రభుత్వం పాఠశాలలో చేరేలా చూడడం, ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ కమిటీ సమావేశాలలో పాల్గొనడం, పాఠశాలల పరిశుభ్రతను పర్యవేక్షించడం, పాఠశాలలలో నెలకొన్న చిన్న సమస్యలను పరిష్కరించడం, బాలిక విద్యను ప్రోత్సహించడం, దివ్యాంగ పిల్లలకు మద్దతునిచ్చి వారికి భరోసా కల్పించడం, క్రీడలకు తమ ప్రోత్సాహాన్ని అందించడం, పాఠశాల విద్యార్థుల ప్రతిభను, విజయాలను ప్రచారం చేయడం, పాఠశాలలను గౌరవంగా చూసుకునేలా సర్పంచులు, కౌన్సిలర్లు, పంచాయతీ పాలకవర్గం భాగస్వాములు కావాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమయపాలన, నాణ్యమైన విద్య బోధనపై పర్యవేక్షించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహాయ ఉపకరణాలు అందించడంలో అలింకో సంస్థ సహకారం అభినందనీయం

## జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సహాయ ఉప కరణాలు అందించడంలో అలింకో సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రకటి ప్రణాళిక 99 రోజుల కార్యాచ రణలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సహాయ ఉపకరణాలు అందించడానికి అలింకో సంస్థ సహకారం అభినందనీయమని అన్నారు. గత 2 నెలల క్రింద జనకాపూర్ లో భవిత కేంద్రంలో సందర్శించి నప్పుడు పిల్లల తల్లిదండ్రులు ఉపకరణాల అవసరాన్ని తన దృష్టికి తీసుకురావడంతో ఈ విషయమై అలింకో సంస్థ వారిని సంప్రదించడం జరిగిందని, దాదాపు 22 లక్షల రూపాయలతో 184 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు సంస్థ వారు ముందుకు వచ్చారని తెలిపారు. మనం దివ్యాంగ పిల్లలపై జాలి మాత్రమే చూపించకుండా వారికి సమాజంలో మనతో సమానంగా జీవించేందుకు మనోధైర్యాన్ని కల్పించాలని తెలిపారు. దివ్యాంగులు ఎన్నో రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. పిల్లలకు పంపిణీ చేసిన సహాయ ఉపకరణాలను ఉపయోగించుకోవాలని, ఏవైనా సమస్యలు వస్తే అలింకో సంస్థను సంప్రదించాలని తెలిపారు. శారీరక, మానసిక దివ్యాంగత్వం, వినికిడి లోపం, అంధత్వంతో బాధపడుతున్న పిల్లలకు అవస రమైన ఉపకరణాలు వీల్ చైర్లు, చంక కర్రలు, ట్రై సైకిల్లు, కోలెటర్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ ప్లేట్లు, ఎమ్మార్ కిట్లు, కృత్రిమ అవయవాల వంటి ఉపకరణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంక్సాపూర్లో కుల పెద్దల ఆగడాలు అరికట్టాలి

## డీఎస్పీకి వినతి



**ఆసిఫాబాద్ రూరల్:** ఆసిఫాబాద్ మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో తేలి కుల పెద్దల అరాచకాలు మితిమీరిపోతున్నాయని, వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు రేగుంట కేశవ్ రావు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు సంఘాల నాయకులతో కలిసి ఆయన బుధవారం ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తండ్రీకొ డుకుల కలహాలైనా, భార్యాభర్తల గొడవలైనా సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి, లక్షలాది రూపాయల జరిమానాలు విధిస్తూ సామాన్యులను వేధి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిని కుల బహిష్కరణ చేస్తూ ఏళ్ల తరబడి మానసిక వేదనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా నాలుగు రోజుల క్రితం ఒక మహిళ తన చేనులో పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు ఆమెపై అసభ్యంగా ప్రవర్తించి అత్యాచార యత్నం చేశాడని తెలిపారు. ఈ విషయాన్ని బాధిత మహిళ తన కుటుంబ సభ్యులకు చెప్పగా, వారు నిందితుడిని మందలించారని వివరించారు. అయితే కుల పెద్దలు నిందితుడికి వత్తాసు పలుకుతూ బాధితురాలి కుటుంబానికే 50 వేల రూపాయల జరిమానా విధించడం అమానుషమని మండిపడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కుల బహిష్కరణ చేస్తామని బెదిరించడం వల్లే వారు మీడియా ముందుకు రావడానికి కూడా భయపడుతున్నారని తెలిపారు.ఈ విషయంలో పోలీసులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మావల్కర్ అశోక్, నాయకులు ఇగురపు గణేష్, గంగుబాయి, పచ్చకి కేశవ్, రేగుంట మహేష్, ఆత్రం పాండు పటేల్, వినోద్ కుమార్, మనీష్ కుమార్ సింగ్ తదితరులు ఉన్నారు.డీఎస్పీ కి సన్మానం ఆసిఫాబాద్ నూతన డిఎస్ పి గా బాధ్యతలు స్వీకరించిన అశోక్ కి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు పుష్పగుచ్చం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు.

# ప్రశాంతంగా పాలీసెట్ ప్రవేశ పరీక్ష



## 1002 విద్యార్థులు హాజరు

**ఆసిఫాబాద్ టౌన్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన పాలీసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది.స్థానిక మాతృశ్రీ డిగ్రీ కళాశాల , ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడె న్షియల్ కళాశాల ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను నిర్వహించారు. ఆయా కేంద్రాలలో పరీక్షలు రాసేందుకు 1064 మంది విద్యార్థులను కేటాయించగా 1002 మంది విద్యార్థులు హాజరు కాగా 62 మంది విద్యార్థులు గర్హైజర్ అయ్యారు. 94. 14% హాజరు శాతం నమోదు కాగా ఆయా పరీక్ష కేంద్రాల్లో పాలీసెట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆయా పరీక్ష కేంద్రాలను స్పెషల్ అబ్జర్వర్ మసాడే శంకర్, జిల్లా సమన్వయ కోఆర్డినేటర్ కనకయ్యలు పరిశీ లించగా ఎస్ హెచ్ ఓ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆయాపరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రశ్నపత్రాలను పాలీసెట్ 2026 కన్వీనర్ హైదరాబాద్ కార్యాలయానికి తరలించారు.

# జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## జిలాల కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో కొన సాగుతున్న జనగణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికా రులను ఆదేశించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్, బొక్కలగూడ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న జనగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు నమోదు చేస్తున్న సెన్సస్ నంబర్లు, సిద్ధం చేసిన లేఅవుట్ మ్యాపులను స్వయంగా తనిఖీ చేశారు. సర్వే నమోదు ప్రక్రియ క్రమబద్ధంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సిబ్బంది పనితీరును అభినం దించారు. గురువారం నుంచి హెచ్ఎల్ఓ యాప్ ద్వారా డేటా నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సాంకేతిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన–2027 ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సరైన సమాచారం అందించి ప్రభుత్వ ప్రణాళికల అమలుకు సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట మాస్టర్ ట్రైనర్ శ్రీహరిబాబు, ఫీల్డ్ ట్రైనర్ సుజాత్ ఖాన్, మున్సిపల్ సిబ్బంది సాయికృష్ణ, నవీన్ కుమార్, సంబంధిత సూపర్వైజర్లు, ఎన్యుమ రేటర్లు తదితరులు ఉన్నారు.




# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ మాసాంతం వరకు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్ టౌన్ :** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ ఈ నెల చివరి వరకు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లతో ఆసిఫాబాద్ నియోజకవర్గస్థాయి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ మాసాంతం వరకు 100 శాతం పూర్తి చేయాలని, నియోజకవర్గంలోని మండలాల తహసిల్దార్లు, ఎ పి ఎం లు, సూపర్వైజర్లు మ్యాపింగ్ శాతం తక్కువ ఉన్న ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. మరణించిన ఓటర్లు, గ్రామంను వదిలి వెళ్ళిపోయిన ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. సెర్ప్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకోవాలని, రాజకీయ పార్టీలు తమ పార్టీ తరపున బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను అందించాలని, మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్లతో ధాన్యం కొనుగోలు, గోనె సంచుల లభ్యత, మొక్కజొన్న కొనుగోలు, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల జారీ, పెండింగ్ అంశాలపై సమీక్షించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియ వేగవంతం చేయడానికి ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, గిర్దావార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం వైఫల్యంతోనే విద్యార్థుల భవిష్యత్తు అంధకారం



**బోథ్:** బీజేపీ సర్కారు వైఫల్యంతోనే విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల వ్యవహారంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం నేరేడిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాత్రింబగళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం అంధకారంలోకి నెట్టివేసిందని విమర్శించారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో జరిగిన నీట్ పరీక్షలో అక్రమాలు, పేపర్ లీకేజీలపై వస్తున్న ఆరోపణలు దేశ వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దేశ విద్యా వ్యవస్థను, ప్రతిష్టాత్మక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పరీక్షల పారదర్శకతను కాపాడలేకపోయిన ప్రభుత్వం నిందితులకు కొమ్ముకాస్తూ విద్యార్థుల మానసిక క్షోభకు కారణమవుతోందని ఆరోపించారు. ఈ అక్రమాల కారణంగా ప్రతిభావంతులైన అనేక మంది విద్యార్థులు మెడికల్ సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో నిస్పాక్షికమైన సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో విఫలమైన జాతీయ పరీక్షల సంస్థ ఉన్నతాధికారులను వెంటనే విధుల నుంచి తొలగించి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. నష్టపోయిన అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన చర్యలు ప్రకటించాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ మౌలానా, యువజన కాంగ్రెస్ నాయకులు బండి లింగన్న, క్రాంతి కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాల రాకపోకలు

- **పెరుగుతున్న ప్రమాదాలతో ప్రజల్లో ఆందోళన**

**సత్తుపల్లి:** ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాల రాకపోకలు పెరగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైవేపై భారీ వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్తుండగా, అదే మార్గంలో బైక్లు ప్రయాణించడం ద్వారా ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని చెబుతున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఎంట్రన్స్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సరైన పర్యవేక్షణ చేపట్టకపోవడంతో ద్విచక్ర వాహనాలు హైవేపైకి నిర్బంధం లేకుండా వెళ్తున్నాయని అంటున్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని, వేగంగా వెళ్లే భారీ వాహనాల మధ్య ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను ఫణంగా పెట్టుకుని ప్రయాణిస్తున్నారని పేర్కొంటున్నారు. హైవే నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోందని అంటున్నారు. తక్షణమే హైవే అధికారులు, పోలీసు శాఖ స్పందించి గ్రీన్ ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంట్రన్స్ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మల్యాల్లో ఇందిరమ్మ గృహప్రవేశం



**ఇచ్చోడ:** ఇచ్చోడ మండలం మల్యాల్ గ్రామంలో బుధవారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతి కుమార్ ఇందిరమ్మ నూతన గృహప్రవేశం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై క్రాంతి కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొమరం కోటేశ్వర్ నూతన గృహ యజమాని క్రాంతి కుమార్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కల నెరవేరుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కల్లెం నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి బద్దం పురుషోత్తం రెడ్డి, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, జనరల్ సెక్రటరీ చోలే ప్రభాకర్, మండల మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ రషీద్, మాజీ ఉప సర్పంచ్ షేక్ మహబూబ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పట్ల గోవర్ధన్, మునేశ్వర్, కోటేష్, ప్రవీణ్ పటేల్, మజీద్ ఖాన్, షేక్ జహీర్, మోసిన్ ఖాన్, ముషారఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. తెలంగాణ రైతుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు పండించిన వడ్లను చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులకు శ్రీకారం

- **కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి**



**తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎగ్గె సంధ్యారాణి–శ్రీనివాస్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులను మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కాల మల్లేష్, చీకటి వెంకటేష్ గౌడ్, కటకల రాజ్కుమార్, వార్డు సభ్యులు జంబోజుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి సహకరించాలి



**సత్తుపల్లి:** విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరు సహకరించాలని మండల తహశీల్దార్ మాణిక్రావు అన్నారు. వేంసూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన బుధవారం సదస్సు నిర్వహించారు. ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాల నేపథ్యంలో మూడవ రోజు బుధవారం సర్పంచులకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు సంక్షేమ, విద్యా అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో విద్యాభివృద్ధికి సర్పంచులు సహకరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కావ్య, ఎంఈఓ వెంకటేశ్వరరావు పాల్గొని ప్రభుత్వ విద్యా రంగంలో చేపడుతున్న అభివృద్ధి చర్యలు, విద్యార్థుల సంక్షేమ పథకాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహప్రవేశం



**ఇచ్చోడ:** ఇచ్చోడ మండలంలోని అడిగామా(కె) గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు యాఖరి రమేష్ రెడ్డి నూతనంగా నిర్మించుకున్న 'ఇందిరమ్మ ఇల్లు' గృహప్రవేశ మహోత్సవం బుధవారం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై రమేష్ రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కల్లెం నారాయణరెడ్డి ప్రత్యేకంగా హాజరై యాఖరి రమేష్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసే కార్యకర్తలు సుఖసంతోషాలతో ఉండడమే కాంగ్రెస్ పార్టీ ఆశయమని అన్నారు. రమేష్ రెడ్డి సొంతింటి కల నెరవేరడం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ బద్దం పురుషోత్తం రెడ్డి, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా మాట్లాడుతూ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని పేర్కొన్నారు. రమేష్ రెడ్డి వంటి నిబద్ధత కలిగిన నాయకుడి గృహప్రవేశ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడే నాయకత్వం రమేష్ రెడ్డికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చోలే ప్రభాకర్, ఇచ్చోడ మండల మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ రషీద్, సీనియర్ నాయకులు నడికుంట ఆశన్న, తుకారాం, మహేందర్ రెడ్డి, అరుగుల సాయన్న, షేక్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులను అతివేగంగా ఢీకొట్టిన కారు

## ఓ మహిళా మృతి







**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం గజసింగవరం బస్టాండ్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళతో పాటు చిన్నారి గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఇద్దరు మహిళలు చిన్నారితో కలిసి సిరిసిల్లకు వెళ్లేందుకు బస్టాండ్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. బస్సు వస్తున్న సమయంలో మహారాష్ట్రకు చెందిన (ఎంహెచ్ 24 ఏఎఫ్ 3814) నంబర్ గల స్కార్పియో వాహనం అతివేగం, అజాగ్రత్తగా వచ్చి వారిని ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు బాధితులు ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో మహిళ, చిన్నారి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. స్కార్పియో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం వాహనం అతివేగంగా వచ్చి ప్రమాదానికి కారణమైనట్లు పోలీసులు వివరించారు.

# ప్రమాదాలకు కారణమవుతున్న చెట్ల కొమ్మలు

## విద్యుత్ తీగలకు ముప్పు



**గంభీరావుపేట:** మండల కేంద్రంలోని ఉస్మాన్ పుర 14, 15 వార్డులు విద్యుత్ స్తంభాలకు ఆనుకుని పెరిగిన చెట్ల కొమ్మలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతూ ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని కాలోని వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి, వర్షాల సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలే అవకాశం ఎక్కువగా ఉండటంతో షార్ట్ సర్క్యూట్, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వార్డు ప్రజలు చెబుతున్నారు. చిన్నపిల్లలు, పాదచారులు తరచూ వెళ్లే వీధి కావడంతో అధికారులు

# ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు



**కాగజ్నగర్:** ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యమని సిర్పూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్నగర్ మండలంలోని బురుదగూడ చెరువు పునరుద్ధరణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల క్రితం వచ్చిన వరదల కారణంగా చెరువు కట్ట తెగిపోవడంతో ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే చొరవ తీసుకొని రూ.35లక్షల ఓ అండ్ ఎం నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు చెరువు పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువు పునరుద్ధరణతో పరిసర ప్రాంత రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌత్రే లక్ష్మి , ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్, డీఈ తిరుపతి, ఏఈ స్వామి, నాయకులు గోపాల్, నికోడె ప్రభాకర్, డోంగ్రే కార్తీక్, డోంగ్రే భరత్, కొట్రంగి బాబురావు, జీల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.వెంటనే స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి భాగస్వాములు కావాలి

## జిలాల కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రజాప్రతి నిధులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాల సందర్భంగా బుధవారం రిమ్స్ ఆడిటోరియంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని సర్పంచులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లకు నిర్వహించిన విద్యా అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతి నిధులు నాయకత్వం వహించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. గత రెండేళ్లలో సుమారు రూ.40 కోట్ల నిధులతో జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టి పూర్తి చేసినట్లు వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా తల్లిదండ్రులను విద్యా వ్యవస్థలో భాగస్వామ్యం చేశామని, వీటి పర్యవేక్షణలో యూనిఫాంల పంపిణీ, పాఠశాలల ఆధునీకరణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని, అంగన్వాడీ పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులు చదువు మానేయకుండా పర్యవేక్షించాలని తెలిపారు. దివ్యాంగ పిల్లల కోసం భవిత కేంద్రాలను బలోపేతం చేసి, ఏఐ ద్వారా ఆధునిక బోధన అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాలకు నిర్దేశించిన నమోదు లక్ష్యాన్ని చేరుకునేందుకు గ్రామాలు, వార్డుల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజాప్రతి నిధులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఈఓ రాజేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, డీఎల్పీఓ ఫణీందర్, కోఆర్డినేటర్ అజయ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాల నిబంధనలు అమలు చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను జిల్లాలో అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి సెన్సిటైజేషన్ వెబినార్లో ఆయన కలెక్టరేట్లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. వెబినార్ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మే 5న జారీ చేసిన తాజా ఉత్తర్వుల మేరకు ఎస్డబ్ల్యూఎం రూల్స్–2026ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలు ఈ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి, శానిటరీ, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా వంద శాతం సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, కాల్చడం పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, వారి ప్రాంగణాల్లోనే వ్యర్థాల ప్రాసెసింగ్ జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. చెత్త నిల్వలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, మండల, గ్రామ స్థాయిలో వ్యర్థాల నిర్వహణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, క్షేత్రస్థాయి అధికారులు అమలు నివేదికలను ఫొటోలతో సహా జిల్లా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై ఎస్డబ్ల్యూఎం రూల్స్ ప్రకారం జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, డీఎల్పీఓ ఫణిందర్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం

- **ఇద్దరు చిన్నారులను దత్తతకు అందజేసిన జిల్లా యంత్రాంగం**





**, సిరిసిల్ల:** పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం లాంటిదని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇద్దరు చిన్నారులను చట్టబద్ధంగా దత్తతకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను ప్రేమగా పెంచుతూ వారి భవిష్యత్తుకు మంచి మార్గం చూపాలని దత్తత తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా ఆన్లైన్లో మాత్రమే ఎంపిక చేసుకోవాలని తెలిపారు. అక్రమ మార్గాల్లో దత్తత తీసుకుంటే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1లక్ష జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలను పెంచే స్థోమత లేని తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించవచ్చని పేర్కొన్నారు. పిల్లలను రోడ్లపై వదిలివేయడం, నిర్లక్ష్యం చేయడం వంటి చర్యలపై జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పిల్లలను వదిలివేయడానికి ప్రోత్సహించిన వారిపైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం దత్తత కోసం అనేక మంది ఎదురుచూస్తున్నారని, అవాంఛిత గర్భం, ఇతర కారణాలతో పిల్లలను పెంచలేని పరిస్థితుల్లో ప్రభుత్వ సంరక్షణ కేంద్రాలకు అప్పగిస్తే, చట్ట ప్రకారం వారికి మంచి కుటుంబాలను కల్పిస్తామని వివరించారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లల సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల ప్రొటెక్షన్ అధికారి గగన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ యూజీ పేపర్ లీకేజీపై నరేష్ జాదవ్ ఆగ్రహం



**ఆదిలాబాద్:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ వ్యాప్తంగా దాదాపు 93సార్లు వివిధ ఉద్యోగ, విద్యా పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ చేతగానితనానికి, పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం, విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుంటుంటే, పేపర్ లీక్ల మాఫియా వారి ఆశలను అడియాశలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు అధికంగా జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతోనే ఈ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన వరుస పేపర్ లీక్ల కారణంగా కోట్లాది మంది యువత తీవ్రంగా నష్టపోయారని అన్నారు. నీట్ యూజీ పేపర్ లీక్ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల:** 2026–27 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్లోని బేగంపేట, రామంతపూర్ ప్రాంతాల్లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 1వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు గిరిజన బాలురకు 3, బాలికలకు 3 చొప్పున మొత్తం 6 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2019 జూన్ 1 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తులతో పాటు బోనఫైడ్, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన తేదీ, నివాస ధ్రువ పత్రాలను ఆయా మండలాల తహశీల్దారులచే జారీ చేయించిన పత్రాలను జత చేయాలని పేర్కొన్నారు. గిరిజన ఉపతెగల వారీగా సీట్ల కేటాయింపు చేపట్టినట్లు పేర్కొంటూ గోండు/నాయక్ పోడ్ వారికి 2 సీట్లు, కొలాం, కోయ, లంబాడా/సుగాలి, ఇతర గిరిజనులకు ఒక్కో సీటు కేటాయించినట్లు వివరించారు. అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఈనెల 22న డ్రా పద్ధతిలో అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు వివరించారు.

# ప్రతి గిరిజన తండాకు స్వచ్ఛమైన ఉచిత త్రాగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి**





**కల్వకుర్తి, మే 13 :**

ప్రతి గిరిజన తండాకు స్వచ్ఛమైన ఉచిత త్రాగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడమే లక్ష్యం అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని కడ్తాల్ మండలం గానుగుమర్ల తండాలో 1,50,000తో వెచ్చించిన ఉచిత తాగునీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ నాయక్ మాట్లాడుతూ మారుమూల గిరిజన తండాల ప్రజల అవసరాలను గుర్తిస్తూ వారి అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తు తోడ్పాటునందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సేవలు అభినందన నియమని అన్నారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన తండాలలో అభివృద్ధి పూర్తిస్థాయిలో చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా గిరిజనులు ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన స్వచ్ఛమైన తాగునీరు ఎంతో శ్రేష్టమని ఫలిష్ట నీటి వల్ల గ్రామీణ ప్రాంతాలలో అనేక వ్యాధుల భారీ పడుతున్నారని అలాంటి సమస్యలను తగ్గించాలని ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా తండాలో గ్రామాలలో ఉచిత తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. ప్రతి గ్రామం తండాకు మౌలిక వసతులు ఉండాలని లక్ష్యంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. పర్యటనలో భాగంగా అదే గ్రామపంచాయతీ పానుగు బావి తండాలో దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎప్పుడు ఎక్కడ అవసరం ఉన్న ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.






# ఆధ్యాత్మికత భక్తి భావాలను పెంపొందించుకోవాలి







- **ప్రజాసేవతో పాటు సమాజంలో ఆధ్యాత్మిక విలువలను ప్రోత్సహించాలి.**
- **కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి, మే 13 :**


సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో కీలకమని గ్రామాలలో ఐక్యత శాంతి భక్తి భావం పెంపొందించడంలో దేవాలయ పాత్ర ముఖ్యమైందని ప్రజాసేవతో పాటు సమాజంలో ఆధ్యాత్మిక విలువలను ప్రోత్సాహించవలసిన బాధ్యత అందరిపై ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకొని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ ఉప సర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్ వార్డు సభ్యులు స్థానిక నాయకులు రాఘవేందర్ ముదిరాజ్ అల్లాణిగౌడ్ కడారి పర్వతాలు యాదవ్ భాషమోని సాయి కుమార్ సుధాకర్ యాదవ్ సురేష్ గౌడ్ శేఖర్ గౌడ్ నర్సింహులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల నెరవేర్చడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల.**

**కల్వకుర్తి, మే 13 :**

పేదల సొంతింటి కళ నెరవేర్చడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం కట్టిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల అన్నారు. బుధవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డు అంబేద్కర్ నగర్ కాలనీలో దున్న జంగయ్య ఇందిరమ్మ ఇల్లును గృహప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరీ కమిటీ మెంబర్ జిల్లెల రాములు మాజీ వైస్ ఎంపీపీ బొమ్మ ఆంజనేయులు మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులు పులిద్వాల చంద్రకాంత్ దున్న సురేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణదాతగా నిలిచిన ఎమ్మెల్యే



**బసవరాజు చికిత్స నిమిత్తం 4 లక్షల ఎల్ఓసీ అందజేత**

**కామారెడ్డి, మే 13 :**

ముత్యంపేట్ గ్రామానికి చెందిన యువకుడి ప్రాణాలను కాపాడేందుకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మానవత్వంతో స్పందించారు. గ్రామానికి చెందిన మ్యాదరి అశోక్ కుమారుడు బసవరాజు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే వైద్య ఖర్చులు భారీగా ఉండటంతో నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడి పరిస్థితిని గమనించిన స్థానికులు, ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. బాధితుడి పరిస్థితిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సుమారు 4,00,000 రూపాయల ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. ఈ ఎల్ఓసి పత్రాన్ని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో తక్షణమే స్పందించి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు బాధితుడి కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్.

**కల్వకుర్తి, మే 13 :**

తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో బుధవారం జరిగిన కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచులు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సదానందం గౌడ్ కు డాక్టరేట్ పురస్కారం..






**కల్వకుర్తి, మే 13 :**

ఉమ్మడి పాలమూరు జిల్లా కల్వకుర్తి ప్రాంతానికి చెందిన అయిల్ సదానందం గౌడ్ కు యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పురస్కారానికి ఎంపిక అయినట్లు బుధవారం నిర్వాహకులు మీడియాకు సమాచారాన్ని అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన అయిల్ సదానందం గౌడ్ నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ చిన్ననాటి నుండే శ్రద్ధతో కష్టపడి చదివి ప్రసిద్ధ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ,ఎంఫిల్, బి.ఎడ్, సెట్ ప్రథమ శ్రేణిలో పట్టా పొందారు. విద్యారంగంలో గత 25 ఏళ్లుగా లెక్చరర్ గా పనిచేసే పర్యావరణ పరిరక్షణకై కృషిచేసినందుకు సామాజిక సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ప్రకటించిందని అన్నరు. ఈనెల 17న చెన్నై లో భారతీయ విద్యా భవన్ లో ఉదయం 9:30 గంటలకు గౌరవ డాక్టరేట్ అవార్డు పురస్కార కార్యక్రమానికి హాజరై పురస్కారాన్ని అందుకోవాల్సిందిగా సమాచారం ఇచ్చారని సదానందం గౌడ్ మీడియాకు తెలిపారు. అవార్డు ఎంపిక పట్ల ఎంతో సంతోషంగా ఉందని ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ రిజిస్టర్ అధికారులు తమిళనాడు మంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు.

## వేస కాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిమే 13 :**

వేసవి కాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయుర్వేద నిపుణులు డా రాగ సుధ సూచిస్తున్నారు. ఆయుర్వేదంలో గ్రీష్మ ఋతువులో పాటించాల్సిన ఆహార, విహార నియమాలను స్పష్టంగా వివరించారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీష్మ ఋతువులో వాత దోషం అధికమవుతుందని, శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల శరీరానికి చలువనిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కీరదోస, దోసకాయ, సోరకాయ, పుచ్చకాయ, నిమ్మరసం, షర్బత్, నన్నారి, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, రాగిజావ వంటి పానీయాలు, తీపి పదార్థాలు తీసుకోవడం మంచిదన్నారు. వేసవిలో చెమట ద్వారా శరీరంలోని నీరు ఎక్కువగా బయటకు వెళ్లిపోతుండటంతో ఎక్కువగా నీరు తాగాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎండలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తడి గుడ్డ వంటి రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడలోకి తీసుకెళ్లి, శరీరంపై చల్లటి నీరు చల్లాలని లేదా తడి గుడ్డతో తుడవాలని సూచించారు. బాధితుడు స్పృహలో ఉంటే నీరు, నిమ్మరసం లేదా ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని తెలిపారు. శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉంటే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని దోమకొండ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్రాగ సుధ మండల ప్రజలకు సూచించారు.

## మల్లారెడ్డిపల్లిలో ఘనంగా డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి జన్మదిన వేడుకలు

**గజ్వేల్ టౌన్, మే 13 :**

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి జన్మదిన వేడుకలు వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంక్షరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ కూలీల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు మజ్జిగ, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ ఆంక్షరెడ్డి చిన్న వయసులోనే డిసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**కుకునూరుపల్లి, మే 13 :**

శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆకాంక్షించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, బోడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈ సంధర్భంగా స్థానిక నాయకుల గ్రాణభివృద్ధికి నిధుల కేటాయించమని కోరగా సానుకులంగా స్పందించారు. ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై స్పందిస్తూ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అంతకు ముందు మంత్రిని శాలువతో సన్మానించారు. పిఎసీఎస్ డైరెక్టర్ సింగోజి నరసింహ చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివలింగు క్రిష్ణమూర్తి, రెడ్డమైన రవీందర్, కొంతం కరుణకర్ తదితరులు ఉన్నారు.



# తెలుగు సినీ గీత రచనకు ఆద్యులు చందాల

## ప్రతిభకు ప్రతిరూపం చందాల కేశవదాసు

తెలుగు సినిమాలలో తొలి పాటను రాసింది ఎవరో తెలుసా? అలాంటి అవసరం, అవకాశం, సందర్భం రాలేదనుకుంటా. 1931లో తీసిన తొట్టతొలి తెలుగు టాకీ చిత్రం భక్త ప్రహ్లాదలో పరితాప భారంబు భరియింప తరమా అనే పాటను రాసింది బహుముఖ ప్రజ్ఞాశాలి చందాల కేశవదాసు. అంతేకాదు ఆయన బహుముఖ ప్రజ్ఞ గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయకుంటే, ఆ మహనీయునికి తీరని అన్యాయం చేసిన వారం అవుతాం. చందాల కేశవదాసు (జూన్ 20, 1876 – మే 14, 1956) తొలి తెలుగు నాటక కర్త, తొలి సినీ ఏీత రచయిత, కవి, నటులు, గాయకులు, హరికథా కళాకారులు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో మొదట పాడే పరబ్రహ్మ పరమేశ్వర అనే గొప్ప కీర్తనను, తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే భలే మంచి చౌక బేరము అనే పాటను రాసింది కూడా ఆయనే. కేశవదాసు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని జక్కేపల్లి లో 1876 జూన్ 20వ తేదీన చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు రెండవ కుమారుడిగా జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో వీధిబడిలోనే కేశవదాసు విద్యనభ్యసించారు. ఛందస్సు, అవధానాధి ప్రక్రియలు నేర్చుకున్నారు. విద్యాభ్యాస అనంతరం తను చదువుకున్న వీధి బడి నడుపుతూ అవధానాది ప్రక్రియలలో నేర్పు సాధించారు. అష్టావధానాలు చేస్తూ దేశాటన చేస్తున్న కాలంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్యతో స్నేహం ఏర్పడి, కాంతయ్య ద్వారా సంఏతంలోని మెలకువలు నేర్చుకున్నారు. గేయరచనలో, సంఏతం కూర్పులో, హరికథనంలో, రచనలో కేశవదాసు ఆరితేరారు. కాంతయ్యనాటక సమాజంలోచేరి కవిగా, నటుడిగా పేరుగాంచారు. ఈయన సేవకుడు వేషం నుంచి రాజు వేషం వరకు ఏ వేషమైనా వేసి మెప్పించగల సమర్థులు. మైలవరం కంపెనీకి శ్రీకృష్ణ తులాభారం, రాధా కృష్ణ నాటకాలకు పాటలు రాసిచ్చారు. అలా శ్రీకృష్ణ తులాభారం కోసం 'భలే మంచి చౌక బేరము సమయము మించినన్ దొరుకదు', నాటకాల్లో మొదట పాడే 'పరబ్రహ్మ పరమేశ్వర' అనే సుప్రసిద్ధ కీర్తన కేశవదాసు రాశారు. భక్త ప్రహ్లాద, కనకతార వంటి చిత్రాలకు కేశవదాసు మాటలు, పాటలు వ్రాశారు.

1930–33ల మధ్య కేశవదాసు వ్రాసిన జాతీయ ఏతాలను సినీ గాయకుడు సాలూరు రాజేశ్వర రావు, అముల నరసింహా రావులు పాడగా బెంగుళూరులో రికార్డు చేశారు. ఈయన అనేక సినిమా స్క్రిప్టులతో పాటుగా, కేశవ శతకం, బలి బంధనం, సీతా కళ్యాణం, రుక్మాంగద, మేలు కొలుపులు, జోలపాటలు మొదలైన రచనలు చేశారు. బాల భారత్ సమాజం వారు ఆయన ఆధ్వర్యంలో అనేక నాటకాలను ప్రదర్శించేవారు. "కనక తార", "లంకా దహనం" వంటి నాటకాలను సినిమాలుగా కూడా తీసారు. నాటక రంగంలో చందాల కేశవదాసు మంచి పేరుతో ఒక వెలుగు వెలిగిపోతున్న సమయంలో సినిమా రంగం ఆహ్వానం పలికింది. అప్పటి దాకా భారతదేశ మంతటా మూగ సినిమాలు ఆడేవి. 1931 మార్చి 15న దేశంలో తొలిసారిగా 'ఆలం ఆరా' అనే మాటలతో కూడిన సినిమా వచ్చింది. ఇదే తొలి భారతీయ టాకీ. అదే యేడాది తెలుగులో కూడా టాకీ చిత్రం తీయాలనుకుని భక్త ప్రహ్లాద చిత్రం (1931–32)న ప్రారంభించారు. ఆ చిత్రంలో పాటలు రాయడానికి మన చందాల కేశవదాసును పిలవడంతో ఆయన సినీ జీవితం మొదలైంది. ఈచిత్రంలో ప్రహ్లాదునిగా కృష్ణాజిరావు షిండే, హిరణ్య కశ్యపునిగా మునిపల్లె సుబ్బయ్య, లీలావతిగా సురభి కమలాబాయి నటించారు. చిత్రంలో ఈమె పాడిన పరితాప భారంబు భరియింప తరమా పాటనే చందాల కేశవదాసు సినిమాకు రాసిన తొలిపాట. తనయా ఇటులన్ తగుపలుకు, మునిపల్లె సుబ్బయ్య పాడిన భీకరమగు నా ప్రతాపంబునకు భీతిలేక ఇటు చేసెదవా రెండు పాటలు కూడా చందాల రాశారు. 1935లో అరోరా ఫిలిమ్స్ ఆరోరా ఫిలిమ్స్ వారు 'అనసూయ' చిత్రాన్ని కోల్‌కత్తాలో తీశారు. ఈ సినిమాకి మాటలు, పాటలు, పద్యాలూ అన్నీ కేశవదాసే రాశారు. 1935లో సతీ అనసూయ, ధ్రువవిజయం, సినిమాలకు రచయితగా పని చేశారు.

స్వాతంత్ర్య సమర సమయంలో గాంధీజీ విధానాలకు ముగ్ధుడై గాంధీని తన రచనలతో ప్రశంసించకుండా వుండలేక పోయారు. "జయతు జై" అంటూ పాట రాయడమే కాక దానిని ఆకుల నరసింహారావు, సాగి రాజేశ్వర రావులతో పాడించి బెంగుళూరులో స్వంత ఖర్చులతో రికార్డు చేయించి ఉద్యమానికి దోహదకారి అయ్యేలా దానిని విడుదల చేసారు. తన కళా ప్రదర్శనల ద్వారా పొందిన బంగారు కంకణాలను, పతకాలను దాచుకోకుండా సత్కార్యాలకోసం ఖర్చుచేసి మార్గదర్శకంగా నిలిచాడు. హరికథా గానంతో వచ్చిన డబ్బుతో భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం బావి త్రవ్వించి, భోజన, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. తన ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న కలపను సీతారామ చంద్రస్వామి రథగోపుర నిర్మాణానికి వాడారు. తమ్మరలో గాలిగోపురం, ధ్వజస్తంభం పనులు డబ్బులేక ఆగిపోతే ఇంటికి మనిషిని పంపించి బార్యచేతి బంగారు గాజులు తెప్పించి అమ్మారు. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ దగ్గర్లో వున్న సీతారామ చంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ కావించారు. భద్రాచలం తిరువూరు మార్గం నుండి వేళ్లే భక్తులకు తిరువూరులో సత్రాలు ఏర్పాటు చేశారు. స్వంత ఖర్చుతో వీటిల్లో భక్తులకు ఉచిత అన్న దానం చేశారు. కోదాడ మండలం తమ్మరలో సీతారామచంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. రజాకార్లు జక్కేపల్లిలో కేశవదాసు ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఆ దాడిలో ఆయన ఆస్తిపాస్తులు, ధనమే గాక అంతకన్న విలువైన ఆయన సాహిత్య సంపద కూడా నాశనమైనది. కేశవదాసు 1956 మే 14న అంటే దుర్ముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం లో మరణించారు.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్కైలాబ్

ఆకాశం నుండి రాలిన మృత్యువు..

తెలంగాణను వణికించిన 'అంతరిక్ష' ప్రళయం!

నేటితో 53 ఏళ్లు.. నాటి భయానక స్మృతులను గుర్తు చేసుకుంటున్న ఉత్తర తెలంగాణ





సరిగ్గా 53 ఏళ్ల క్రితం, మే 14, 1973న అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' ప్రతిష్టాత్మకమైన 'స్కైలాబ్' పరిశోధనా కేంద్రాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. నేటి తరానికి ఈ పేరు కొత్తగా అనిపించినా, యాభై ఏళ్లు పైబడిన వారికి మాత్రం 'స్కైలాబ్' అంటే ఇప్పటికీ వణుకే. అది ఒక ఉపగ్రహం కంటే కూడా, జనజీవనాన్ని అతలాకుతలం చేసిన ఒక భయంకరమైన జ్ఞాపకం.

### అంతరిక్షంలో అద్భుతం.. భూమిపై భయం:

భూమికి 278 నుండి 460 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించే ఈ అతిపెద్ద పరిశోధనా కేంద్రం, భూమిని రోజుకు 16 సార్లు చుట్టి వచ్చేది. అయితే, అంతరిక్షంలో పరిశోధనల కోసం పంపిన ఈ నౌక, 1978 చివరలో నియంత్రణ కోల్పోయి గతి తప్పింది. అది వేగంగా వచ్చి భూమిని ఢీకొనడం ఖాయమని, అది ఎక్కడ పడుతుందో తెలియదని రేడియోల ద్వారా వెలువడ్డ వార్తలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయి.

### తెలంగాణపైనే పడుతుందా?

స్కైలాబ్ భారత భూభాగంలోనే, ముఖ్యంగా తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా పరిసరాల్లో ఎక్కడో ఒకచోట పడే అవకాశం ఉందన్న ప్రచారం దావానంలా వ్యాపించింది. చదువుకున్న వారు, చదువులేని వారు అన్న తేడా లేకుండా అందరూ తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. ఆకాశం నుండి నక్షత్రం వంటిది పడి మనుషులంతా చనిపోతారని, ప్రళయం వస్తుందని ఊరూరా చర్చలు జరిగేవి. 1979లో సుమారు మూడు వారాల పాటు ప్రజలు కంటికి కునుకు లేకుండా గడిపిన పరిస్థితులు నేటికీ అపూర్వమే.

### ముఖ్యమంత్రి మొక్కులు.. ప్రార్థనలు

నాటి తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. 1979 జూలై 11న ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని సందర్శించి, వేద పండితులతో కలిసి గండం గడవాలని భగవదారాధనలో గడపడం విశేషం.

### శుభం పలికిన సముద్రం:

అదృష్టవశాత్తూ, అందరూ భయపడినట్లుగా స్కైలాబ్ జనవాసాలపై పడలేదు. 1979 జూలై 11న అది భూవాతావరణంలోకి ప్రవేశించి విచ్ఛిన్నమైపోగా, దాని శకలాలు హిందూ మహాసముద్రం మరియు పశ్చిమ ఆస్ట్రేలియాలోని నిర్జన ప్రాంతాల్లో పడ్డాయి. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. అంతరిక్ష విజ్ఞానం ఎంతటి అద్భుతాన్ని సృష్టిస్తుందో, అది నియంత్రణ తప్పితే ఎంతటి భయాందోళనలకు గురిచేస్తుందో చెప్పడానికి 'స్కైలాబ్' ఒక నిలువెత్తు నిదర్శనంగా మిగిలిపోయింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నిజాం నిరంకుశత్వానికి సింహస్వప్నం.. నూతి విశ్వామిత్ర!



సాయుధ పోరాటంలో నైతిక మార్గదర్శకుడు

## నేడు నూతి విశ్వామిత్ర జయంతి

తెలంగాణ మట్టిలో నిజాం వ్యతిరేక పోరాట స్ఫూర్తిని రగిలించి, సామాజిక సమానత్వం కోసం అహోరాత్రులు శ్రమించిన యోధుడు నూతి విశ్వామిత్ర. ఆర్యసమాజ తత్వంతో అణచివేతను ఎదిరించి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నైతిక మార్గదర్శకుడిగా నిలిచిన ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

### వేద స్ఫూర్తితో చైతన్య ప్రస్థానం:

1926 మే 14న నల్గొండ జిల్లాలో జన్మించిన విశ్వామిత్ర, నాటి నిజాం పాలకుల దమనకాండను చూసి చలించిపోయారు. ఆర్యసమాజ ప్రభావంతో ప్రజలకు అక్షర జ్ఞానం, స్వాతంత్ర్యం మరియు సమానత్వంపై అవగాహన కలిగించారు. 'శుద్ధి ఉద్యమం' ద్వారా మత మార్పిడికి గురైన వారిని తిరిగి స్వధర్మంలోకి ఆహ్వానిస్తూ సమాజ పునర్నిర్మాణానికి ఊపిరి పోశారు. 1940వ దశకంలో యువకులు, రైతులు, మరియు దళితులతో కలిసి 'ఆరెంజ్ ఆర్మీ' అనే రహస్య విప్లవ సంస్థను ఆయన ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా జమీందార్ల దోపిడీని, ప్రభుత్వ భూముల ఆక్రమణను ఎదిరించారు. నిజాం రాజ్యంలో నెలకొన్న ఉగ్ర నిర్బంధాల వల్ల ఉద్యమాన్ని గుప్తంగా, సాయుధంగా నడిపించి ప్రజల్లో ఆత్మబలాన్ని నింపారు.

### రైతాంగ పోరాటంలో నైతిక బలం:

1946లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో విశ్వామిత్ర కీలక పాత్ర పోషించారు. భూస్వాముల చెరలో ఉన్న రైతులకు విముక్తి కలిగించడానికి, ఆయుధాలు పట్టి పోరాడుతున్న వారికి తన ప్రసంగాల ద్వారా దిశానిర్దేశం చేశారు. ద్వేషం రేకెత్తించకుండానే 'ఆత్మరక్షణ హక్కు'ను బలంగా బోధించి అబలుల పరిరక్షణ కోసం నిలిచారు.

### చివరి శ్వాస వరకు ప్రజా సేవలోనే..

నిజాం పాలన అంతరించాక కూడా పదవుల పట్ల ఆశ చూపకుండా సామాజిక సేవకే అంకితమయ్యారు. ముఖ్యంగా బాలికా విద్య, వేద పాఠశాలల నిర్వహణపై దృష్టి సారించారు. 2005 డిసెంబర్ 3న మరణించే వరకు ఆయన జీవితం ఒక మౌన ఉద్యమంలా సాగింది. చరిత్ర పుటల్లో ఆయనకు తగిన గుర్తింపు దక్కకపోయినా, ఆయన రాసిన ఆత్మపరిశీలనాత్మక రచనలు నేటికీ పరిశోధకులకు కొత్త వేదాలుగా నిలుస్తున్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సకల దోషాలను హరించే ప్రదోష వ్రతం

### నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

భక్తి మార్గం: ప్రదోషం అంటే పాప నిర్మూలన అని అర్థం. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోష కాలంగా శాస్త్రాలు అభివర్ణిస్తున్నాయి. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయంలో చంద్రుడి కదలికల వల్ల ఏర్పడే ఈ కాలాన్ని రాత్రికి ప్రారంభం వంటిదిగా పండితులు చెబుతుంటారు. ఈ పవిత్ర సమయంలో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంలో ఆనంద తాండవం చేస్తాడని శివ భక్తుల విశ్వాసం. ముఖ్యంగా త్రయోదశి నాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అని పిలుస్తారు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం భక్తులు ఈ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

సాధారణంగా ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో సుమారు రెండు గంటల ఇరవై నాలుగు నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ఈ సమయంలో శివారాధన చేయడం వల్ల సమస్త దేవతలను పూజించిన ఫలితం దక్కుతుందని నృత్యరత్నావళిలో పేర్కొనబడింది. శివుడు అభిషేక ప్రియుడు కావడంతో, ఈ సమయంలో పంచామృతాలతో ఆయనకు అభిషేకం నిర్వహించడం విశేష ఫలితాలను ఇస్తుంది. ప్రదోషం రోజున ఉదయమే స్నానమాచరించి, విభూతిని ధరించి, రోజంతా పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ ఉపవాసం ఉండటం శ్రేయస్కరం. సాయంకాలం వేళ శివ షోడశోపచార పూజలు నిర్వహించి, 108 సార్లు మహా మృత్యుంజయ మంత్రాన్ని పఠించడం వల్ల మృత్యు భయం తొలగిపోతుందని భక్తులు నమ్ముతారు. త్రయోదశి తిథి ఏ వారంలో వస్తుందనే దానిని బట్టి ఆ ప్రదోషానికి ప్రత్యేక ఫలితాలు లభిస్తాయి. సోమవారం వస్తే సోమ ప్రదోషమని, ఇది మనసులోని మలినాలను తొలగిస్తుందని చెబుతారు. అలాగే శనివారం వచ్చే శని ప్రదోషం వల్ల శని దోషాలు హరిస్తాయని, గురువారం వచ్చే గురు ప్రదోషం వల్ల విద్యాబుద్ధులు కలుగుతాయని పురాణాలు వివరిస్తున్నాయి. ప్రదోష కాలంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధించడం వల్ల బుద్ధికుశలత పెరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ పవిత్ర సమయంలో శివాలయాలను దర్శించి నేతి దీపారాధన చేసే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని వేద పండితులు పేర్కొంటున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# పసిడి పరుగులు.. వెండి షాక్

**హైదరాబాద్, మే 13 :** దేశంలో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగి సామాన్యులకు షాక్ ఇచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలు పెంచిన నేపథ్యంలో పసిడి ధరలు కొత్త గరిష్ఠాలను తాకుతున్నాయి. బులియన్ మార్కెట్‌లో నేడు బంగారం ధరలు దాదాపు రూ.14 వేల మేర ఎగబాకగా, వెండి ధర కిలోకు రూ.20 వేల వరకు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం, బుధవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,67,890కు చేరింది. గత ముగింపుతో పోలిస్తే ధర ఏకంగా రూ.13,910 పెరిగింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.12,750 పెరిగి రూ.1,53,900కు చేరుకుంది. వెండి ధర కూడా భారీగా పెరిగి కిలోకు రూ.3.10 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,68,000కు చేరుకోగా, ఢిల్లీలో రూ.1,68,040 వద్ద కొనసాగుతోంది. ముంబైలో కూడా ధర రూ.1,67,890కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,54,000గా ఉండగా, ఢిల్లీలో రూ.1,54,050, ముంబైలో రూ.1,53,900 వద్ద నమోదైంది. వెండి ధరలు కూడా దేశవ్యాప్తంగా భారీగా పెరిగాయి. అనేక నగరాల్లో కిలో వెండి రూ.3.10 లక్షలకు చేరగా, కేరళలో మాత్రం ధర మరింత ఎగబాకి రూ.3.30 లక్షల వద్ద ట్రేడవుతోంది. దీంతో బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకుంటున్న వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల ఔన్స్ బంగారం ధర 4,704 డాలర్ల వద్ద ఉండగా, వెండి ఔన్స్ ధర 86 డాలర్లుగా నమోదైంది. ఇదే సమయంలో రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠాలను తాకడంతో కరెంట్ అకౌంట్ లోటును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను పెంచింది. ఈ నిర్ణయం కూడా దేశీయ మార్కెట్‌లో ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారిందని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు.

# పన్ను లేకుండా 15 లక్షల ఆదాయం

## ఇలా ప్లాన్ చేస్తే సాధ్యమే

**న్యూఢిల్లీ, మే 13 :** కొత్త పన్ను విధానంలో మినహాయింపులు తక్కువగా ఉంటాయని చాలామంది భావిస్తుంటారు. అయితే సరైన ఆర్థిక ప్రణాళికతో ఏడాదికి రూ.15 లక్షల వరకు ఆదాయం ఉన్న ఉద్యోగులు కూడా పన్ను భారం లేకుండా ఉండే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్టాండర్డ్ డిడక్షన్, ఎన్పీఎస్ మినహాయింపులు, కొన్ని ప్రత్యేక అలవెన్సులను సద్వినియోగం చేసుకుంటే పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరిస్తున్నారు. కొత్త పన్ను విధానంలో వేతన జీవులకు ప్రభుత్వం రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్‌ను కల్పిస్తోంది. అంటే మొత్తం వార్షిక ఆదాయం నుంచి ఈ మొత్తాన్ని నేరుగా తగ్గించి పన్ను లెక్కిస్తారు. అలాగే యజమాని ఉద్యోగి ఎన్పీఎస్ ఖాతాలో జమ చేసే మొత్తంపై కూడా మినహాయింపు ఉంటుంది. బేసిక్ జీతంలో 10 శాతం నుంచి 14 శాతం వరకు కంపెనీ జమ చేసే మొత్తాన్ని పన్ను పరిధిలోకి తీసుకోరు. దీంతో పన్ను చెల్లించాల్సిన ఆదాయం మరింత తగ్గుతుంది. ఇక పదవీ విరమణ సమయంలో వచ్చే గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లపై కూడా రూ.25 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. దివ్యాంగ ఉద్యోగులకు రవాణా అలవెన్సుపై నెలకు రూ.3,200 వరకు మినహాయింపు ఉంటుంది. అదనంగా ఆఫీస్ పనుల కోసం అయ్యే కన్వేయన్స్, డైలీ అలవెన్స్, హెల్పర్ ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌పై కూడా పన్ను మినహాయింపులు వర్తిస్తాయి. ప్రస్తుతం కొత్త పన్ను విధానంలో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.12 లక్షల లోపు ఉంటే సెక్షన్ 87ఏ కింద పూర్తి పన్ను రాయితీ లభిస్తోంది. అంటే స్టాండర్డ్ డిడక్షన్, ఎన్పీఎస్ కంట్రిబ్యూషన్, ఇతర ట్యాక్స్ ఫ్రీ అలవెన్సులు పోను మిగిలే ఆదాయం రూ.12 లక్షలకు లోపే ఉంటే ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. అయితే ఇది ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా వర్తించదని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగి జీత నిర్మాణం, కంపెనీ అందించే అలవెన్సులు, ఎన్పీఎస్ సదుపాయాలపై ఈ ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయని పేర్కొంటున్నారు. సరైన ఆర్థిక ప్రణాళికతో ముందుగానే జీత నిర్మాణాన్ని సర్దుబాటు చేసుకుంటే పన్ను భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.




# తెలుగు రాష్ట్రాల్లో అమేజాన్ బజార్ దూకుడు

**హైదరాబాద్, మే 13:** భారత ఈ-కామర్స్ రంగంలో ప్రముఖ సంస్థ ళిఅమేజాన్ ఇండియారి చెందిన 'అమేజాన్ బజార్' తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత ఏడాదితో పోలిస్తే ఆర్డర్ల సంఖ్య నాలుగు రెట్లు పెరగడం విశేషంగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరం ఈ వృద్ధికి కేంద్రంగా నిలవగా, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, వరంగల్ నగరాలు కూడా మంచి వృద్ధిని నమోదు చేశాయి. 2026 ప్రారంభ నెలల్లోనే హైదరాబాద్‌లో ఆర్డర్లు ఆరు రెట్లు పెరిగినట్లు సంస్థ వెల్లడించింది. బడ్జెట్ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని రూ.99 నుంచే ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం, ఉచిత డెలివరీ వంటి సౌకర్యాలు వినియోగదారులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ ధరల్లో ఫ్యాషన్, గృహోపకరణాలు, మొబైల్ యాక్సెసరీస్ లభించడం వల్ల చిన్న పట్టణాల్లో కూడా ఆన్‌లైన్ కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. అమేజాన్ బజార్‌లో మహిళల ఫ్యాషన్ విభాగం అత్యధిక ఆదరణ పొందుతోంది. చీరలు, కుర్తాలు, ఫ్యాషన్ నగల కొనుగోళ్లు భారీగా పెరగడంతో ఈ విభాగం ఆరు రెట్ల వృద్ధిని నమోదు చేసింది. అదే సమయంలో గృహ, వంటగది ఉత్పత్తుల విభాగం ఎనిమిది రెట్లు పెరిగి అత్యధిక వృద్ధిని సాధించింది. ఇంటి అలంకరణ వస్తువులు, కిచెన్ సామగ్రికి భారీ డిమాండ్ కనిపిస్తోంది. ఇక మొబైల్ కవర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల విక్రయాలతో ఎలక్ట్రానిక్ యాక్సెసరీస్ విభాగం నాలుగు రెట్లు పెరిగింది.




టియర్-2, టియర్-3 పట్టణాల్లో వినియోగదారుల కొనుగోలు ధోరణిలో వచ్చిన మార్పులే ఈ వృద్ధికి ప్రధాన కారణమని అమేజాన్ బజార్ విభాగాధిపతి సమీర్ లాల్వాని తెలిపారు. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో కూడా ఆన్‌లైన్ షాపింగ్‌పై ఆసక్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అమేజాన్ బజార్ ద్వారా స్థానిక వ్యాపారులకు కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 75 వేల మందికి పైగా విక్రేతలు ఉండగా, వారిలో 1,200 మందికి పైగా అమేజాన్ బజార్ వేదికగా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. విక్రేతల సంఖ్య 2.4 రెట్లు పెరగడంతో పాటు, వినియోగదారులకు అందుబాటులో ఉన్న ఉత్పత్తుల ఎంపిక కూడా 2.5 రెట్లు విస్తరించింది. డెలివరీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అమేజాన్ తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు, మూడు సార్టేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో మరిన్ని చిన్న పట్టణాలకు సేవలను విస్తరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

# కొత్త ఏడు సీట్ల వాహనం విడుదల



**న్యూఢిల్లీ, మే 13 :** జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ భారత మార్కెట్లో కొత్త ఏడు సీట్ల క్రీడా వినియోగ వాహనం 'గ్రావైట్'ను ప్రవేశపెట్టి వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. కుటుంబ అవసరాలు, సుదూర ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ వాహనం తక్కువ ధరకే ఆధునిక సౌకర్యాలను అందించనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ప్రారంభ ఎక్స్ షోరూమ్ ధర రూ.5.65 లక్షల నుంచి ఉండొచ్చని సమాచారం. కొత్త గ్రావైట్ వాహనం ఆకర్షణీయమైన రూపకల్పనతో యువతను ఆకట్టుకుంటోంది. ముందుభాగంలో భారీ గ్రిల్, ఎల్ఈడీ పగటి వెలుగుల దీపాలు, స్పోర్టీ నమూనా ఈ వాహనానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. వాహనం లోపల ఏడు మందికి సౌకర్యవంతమైన సీటింగ్ ఏర్పాటు చేశారు. పెద్ద టచ్‌స్క్రీన్ వినోద వ్యవస్థ, డిజిటల్ మీటర్ ప్యానల్, వైర్‌లెస్ కనెక్టివిటీ, ఆటోమేటిక్ ఉష్ణోగ్రత నియంత్రణ వంటి ఆధునిక సౌకర్యాలు ఇందులో అందుబాటులో ఉన్నాయి. ఇంజన్ విభాగంలో ఒక లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌ను అందించనున్నట్లు తెలుస్తోంది. ఇది మంచి మైలేజీతో పాటు శక్తివంతమైన పనితీరును అందిస్తుందని కంపెనీ పేర్కొంది. మాన్యువల్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఎంపికలు ఉండటంతో నగర ప్రయాణాలు, జాతీయ రహదారులపై ప్రయాణాలకు కూడా అనుకూలంగా ఉంటుంది. భద్రతా అంశాల విషయంలో కూడా కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బహుళ గాలి సంచులు, యాంటీ లాక్ బ్రేకింగ్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ బ్రేక్ పంపిణీ వ్యవస్థ, వెనుక పార్కింగ్ కెమెరా వంటి భద్రతా సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. భారత మార్కెట్లో ఈ వాహనం రెనాల్ట్ ట్రైబర్, మారుతి ఎర్టిగా, కియా కేరెన్స్ వంటి వాహనాలకు పోటీగా నిలవనుంది. తక్కువ ధరలో ఏడు సీట్ల వాహనం కోసం ఎదురుచూస్తున్న మధ్యతరగతి కుటుంబాలకు ఇది మంచి ఎంపికగా మారొచ్చని ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో క్రీడా వినియోగ వాహనాలు, బహుళ ప్రయోజన వాహనాల డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నిస్సాన్ ఈ కొత్త మోడల్‌ను తీసుకొచ్చింది. బుకింగ్, డెలివరీ వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# ఐస్‌క్రీమ్ రంగంలోకి 'వంతారా'

**ముంబై, మే 13 :** జంతు సంక్షేమం, వన్యప్రాణుల సంరక్షణకు గుర్తింపు పొందిన రిలయన్స్ ఫౌండేషన్‌కు చెందిన 'వంతారా' ఇప్పుడు కొత్త వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో 'వంతారా క్రీమరీ' పేరుతో ప్రత్యేక ఐస్‌క్రీమ్ కేంద్రాన్ని ప్రారంభించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త ప్రారంభం సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం అనంత్ అంబానీ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'వంతారా' ప్రాజెక్ట్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు అదే పేరుతో ఆహార రంగంలోకి ప్రవేశించడం ఆసక్తికరంగా మారింది. చేతితో తయారుచేసే ప్రత్యేక ఐస్‌క్రీమ్‌లు, తక్కువ పరిమాణంలో నాణ్యతను కాపాడుతూ తయారీ చేయడం ఈ బ్రాండ్ ప్రత్యేకతగా చెబుతున్నారు. ఈ కొత్త వ్యాపారాన్ని ప్రకటిస్తూ వంతారా తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో ఒక కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రకటన చిత్రాన్ని విడుదల చేసింది. ముంబై రద్దీ వీధుల్లో 'వంతారా క్రీమరీ' వాహనం పరిగెడుతుండగా, దాని వెంట ఒక పులి పరుగెత్తుతూ కనిపించే ఆ దృశ్యాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. వన్యప్రాణుల గుర్తింపును కొత్త వ్యాపార ఆలోచనతో మేళవించే ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు. వంతారా



క్రీమరీలో మొత్తం 17 రకాల ఐస్‌క్రీమ్ రుచులు అందుబాటులోకి తీసుకొచ్చారు. భారతీయ రుచులను దృష్టిలో పెట్టుకుని ఫిల్టర్ కాఫీ, నిమ్మరసం సోర్బెట్, జామ-మిరపపొడి, మలై కుల్ఫీ వంటి ప్రత్యేక రుచులను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ప్రారంభమైన కొద్ది గంటల్లోనే ఈ బ్రాండ్ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ట్రెండ్ అయింది. జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో విస్తరించిన వంతారా ప్రాజెక్ట్ జంతు రక్షణ, సంరక్షణ, పునరావాస కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచింది. 2024లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు ఐస్‌క్రీమ్ రంగంలోకి ప్రవేశించడం ద్వారా యువ వినియోగదారులను ఆకర్షించడమే కాకుండా, తన బ్రాండ్ విస్తరణకు కొత్త దిశలో అడుగులు వేస్తోందని ఆహార, బ్రాండింగ్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# రూపాయి పతనం.. చరిత్రలోనే కనిష్ఠం

**ముంబై, మే 13 :** అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావంతో భారత రూపాయి విలువ మరోసారి భారీగా క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మంగళవారం 40 పైసలు కోల్పోయి చరిత్రలోనే కనిష్ఠ స్థాయి 95.68 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న అనిశ్చితి, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో ఒత్తిడి కారణంగా రూపాయి తీవ్ర బలహీనతను ఎదుర్కొంటోంది. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతుండటంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళన నెలకొంది. ఇంధన సరఫరాపై భయాలు పెరగడంతో పెట్టుబడిదారులు డాలర్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడికి గురవుతున్నాయి. భారత రూపాయి కూడా అదే ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. మంగళవారం ఉదయం 95.57 వద్ద ప్రారంభమైన రూపాయి..



ట్రేడింగ్ సమయంలో మరింత బలహీనపడి 95.74 వరకు పడిపోయింది. చివరకు 95.68 వద్ద స్థిరపడింది. ఇప్పటికే సోమవారం కూడా రూపాయి 79 పైసలు కోల్పోవడంతో వరుసగా రెండు రోజుల్లో భారీ పతనం నమోదైంది. అమెరికా మద్దతుతో వచ్చిన శాంతి ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంతో అంతర్జాతీయ మార్కెట్లలో భయాందోళనలు పెరిగాయని ఫారెక్స్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు దేశంలో చమురు వినియోగాన్ని తగ్గించాలని, బంగారం కొనుగోళ్లను నియంత్రించాలని ప్రధాని చేసిన సూచనలు కూడా కరెన్సీ మార్కెట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషిస్తున్నారు. రూపాయి బలహీనతతో దిగుమతుల వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ఇది పెద్ద సవాలుగా మారనుంది. ఇంధన ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమయ్యే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కోహ్లీ విశ్వరూపం!

అజేయ శతకంతో చెలరేగిన విరాట్.. ■ రాయల్ ఛాలెంజర్స్ ఘనవిజయం

రసవత్తర పోరులో కోల్ కతాపై గెలుపు.. ■ పట్టికలో అగ్రస్థానానికి బెంగళూరు



**రాయ్‌పూర్:** ఐపీఎల్‌లో భాగంగా షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్)పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత విజయం సాధించింది. వర్షం కారణంగా గంట ఆలస్యంగా ప్రారంభమైన ఈ రసవత్తర పోరులో బెంగళూరు 6 వికెట్ల తేడాతో కోల్‌కతాను చిత్తు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అజేయ శతకంతో చెలరేగి ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించాడు. ఈ అద్భుత విజయంతో బెంగళూరు పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో అగ్రస్థానానికి (టేబుల్ టాపర్) దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్ కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు కేవలం 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 194 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. బెంగళూరు బ్యాటర్లలో విరాట్ కోహ్లీ అద్భుత సెంచరీతో కదంతొక్కగా.. దేవ్ దత్ పడిక్కల్ రాణించాడు. బౌలింగ్ లో కార్తీక్ త్యాగి 3 వికెట్లు తీసి కోల్ కతాను కట్టడి చేశాడు.

### రఘువంశీ, రింకూల జోరు..

టాస్ గెలిచిన బెంగళూరు కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుందనే అంచనాలతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే మొదట బ్యాటింగ్ కు దిగిన కోల్ కతాకు యువ కెరటం అంగ్ క్రిష్ రఘువంశీ అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. బెంగళూరు బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మైదానం నలువైపులా షాట్లు బాదాడు. 46 బంతుల్లోనే 71 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. అతనికి తోడుగా విధ్వంసక బ్యాటర్ రింకూ సింగ్ ఆఖర్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 29 బంతుల్లోనే అజేయంగా 49 పరుగులు బాది స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ సైతం 24 బంతుల్లో 32 పరుగులు సాధించి చక్కటి సహకారం అందించడంతో కోల్ కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెంగళూరు బౌలర్లలో యువ పేసర్ కార్తీక్ త్యాగి 32 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి కోల్ కతాను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. సునీల్ నరైన్ 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు.



### ఛేదనలో కింగ్ కోహ్లీ గర్జన..

193 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. లక్ష్యం పెద్దది కావడంతో తొలి బంతి నుంచే బాధ్యతాయుతంగా ఆడుతూనే వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు తరలించాడు. కోల్ కతా బౌలర్లు వికెట్లు తీసేందుకు ప్రయత్నించినా కోహ్లీ ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. కేవలం 60 బంతుల్లోనే అజేయంగా 105 పరుగులు సాధించి 'ఛేజ్ మాస్టర్' అనిపించుకున్నాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన దేవ్ దత్ పడిక్కల్ సైతం అద్భుతమైన షాట్లతో అలరించాడు. 27 బంతుల్లోనే 39 పరుగులు సాధించి కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. చివర్లో జాకబ్ బెథెల్ 12 బంతుల్లో 15 పరుగులు చేయడంతో బెంగళూరు 19.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. కోల్ కతా బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 34 పరుగులిచ్చి 1 వికెట్, జోష్ హేజిల్ వుడ్ 35 పరుగులిచ్చి 1 వికెట్, రసిఖ్ సలామ్ 35 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టినా బెంగళూరు విజయాన్ని ఆపలేకపోయారు.

### అగ్రస్థానంలో రాయల్ ఛాలెంజర్స్..

ఈ సంచలన విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. మొత్తం 12 మ్యాచ్ లు ఆడిన బెంగళూరు 8 విజయాలు, 4 పరాజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్ గా నిలిచింది. రన్ రేట్ సైతం ప్లస్ 1.053 కు పెరిగింది. నిన్నటి వరకు అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ (16 పాయింట్లు, రన్ రేట్ ప్లస్ 0.551) మెరుగైన రన్ రేట్ కారణంగా రెండో స్థానానికి పడిపోయింది. మరోవైపు సన్ రైజర్స్ హైదరాబాద్ 14 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ పోరులో ఓడిన కోల్ కతా నైట్ రైడర్స్ మొత్తం 11 మ్యాచ్ ల్లో 4 విజయాలు, 6 పరాజయాలతో 9 పాయింట్లకే పరిమితమై పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. లీగ్ దశ ముగింపుకు వస్తున్న తరుణంలో అద్భుత విజయంతో బెంగళూరు ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది.



## మహిళల టీ20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు

**మెల్‌బోర్న్, మే 13 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు బుధవారం జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ మోలినెక్స్‌ను ఎంపిక చేయగా, వైస్ కెప్టెన్‌గా ఆష్లే గార్డ్‌నర్ బాధ్యతలు చేపట్టనున్నారు. అనుభవజ్ఞులైన ఎలీస్ పెర్రీ, బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ వంటి స్టార్ ఆటగాళ్లకు కూడా జట్టులో చోటు లభించింది. ఈసారి ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు స్పిన్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్పిన్నర్లు జార్జియా వేర్‌హామ్, అలానా కింగ్‌లకు జట్టులో స్థానం కల్పించారు. మరోవైపు ఫాస్ట్ బౌలర్ డార్సీ బ్రౌన్‌కు అవకాశం దక్కలేదు. ఆమె స్థానంలో 20 ఏళ్ల యువ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ లూసీ హామిల్టన్‌ను ఎంపిక చేశారు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో బెంగళూరు జట్టు తరఫున ఆడిన గ్రేస్ హారిస్, ఎలీస్ పెర్రీ, సోఫీ మోలినెక్స్‌లకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం విశేషం. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ఈ టోర్నీలో గ్రూప్-1లో ఆస్ట్రేలియాతో పాటు భారత్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. జూన్ 13న మాంచెస్టర్ వేదికగా దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, భారత్ జట్లతో తలపడనుంది. జూన్ 28న లార్డ్స్ మైదానంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆస్ట్రేలియా జట్టులో సోఫీ మోలినెక్స్, ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, నికోలా క్యారీ, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, గ్రేస్ హారిస్, అలానా కింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ, ఎలీస్ పెర్రీ, మేగన్ షట్, అన్నబెల్ సదర్లాండ్, జార్జియా వోల్, జార్జియా వేర్‌హామ్ చోటు దక్కించుకున్నారు. రిజర్వ్ వికెట్ కీపర్‌గా తాలియా విల్సన్‌ను ఎంపిక చేశారు.

## ఐపీఎల్ పేరిట సైబర్ మోసాలు



**హైదరాబాద్, మే 13 :** దేశవ్యాప్తంగా ఐపీఎల్ జోరు కొనసాగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు అభిమానులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ టికెట్లు, ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో వెయ్యికిపైగా నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు సైబర్ భద్రతా సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. కీలక మ్యాచ్‌ల సమయంలో టికెట్లు దొరకక ఇబ్బంది పడుతున్న అభిమానులు, ఉచిత ప్రసారం కోసం వెతుకుతున్న వారినే కేటుగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపింది. నివేదిక ప్రకారం నకిలీ ఐపీఎల్ టికెట్ల విక్రయాల కోసం ఆరు వందలకు పైగా నకిలీ డొమైన్లు, ఉచిత మ్యాచ్ ప్రసారం పేరుతో మరో నాలుగు వందలకు పైగా నకిలీ వెబ్‌సైట్లు ప్రస్తుతం చురుకుగా పనిచేస్తున్నాయి. ఈ వెబ్‌సైట్లు అచ్చం అసలు సంస్థల మాదిరిగానే కనిపించేలా రూపొందిస్తున్నారని, అధికారిక గుర్తులు, రంగులు, టికెట్ బుకింగ్ విధానాలను కాపీ చేసి అభిమానులను నమ్మిస్తున్నారని పేర్కొంది. సీట్లు ఎంపిక చేసుకోమని చెప్పి వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు సమాచారం సేకరించి అనంతరం యూపీఐ, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు చెల్లింపులు చేయిస్తున్నట్లు వెల్లడించింది. డబ్బులు చెల్లించిన తరువాత కొందరికి నకిలీ బుకింగ్ గుర్తింపు సంఖ్యలు, నకిలీ క్యూఆర్ కోడ్‌లతో కూడిన పీడీఎఫ్ టికెట్లు కూడా పంపుతున్నారని తెలిపింది. తీరా స్టేడియం వద్దకు వెళ్లిన తరువాతే అది మోసమని బాధితులకు తెలుస్తోందని పేర్కొంది. మరోవైపు ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న లింకులు కూడా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి లింకులు తెరిచిన వెంటనే అనుమానాస్పద అనువర్తనాలు డౌన్‌లోడ్ కావడం, వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సైబర్ భద్రతా నిపుణులు అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టికెట్లు కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ నిజమైనదో కాదో తప్పనిసరిగా పరిశీలించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవొద్దని హెచ్చరించారు. కేవలం అధికారిక వేదికల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని, ఉచిత ప్రసారం పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

## హర్భజన్ భద్రతపై హైకోర్టు ప్రశ్నలు



**చండీగఢ్, మే 13 :** భారత మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్‌కు కేటాయించిన భద్రతా సిబ్బందిపై పంజాబ్, హర్యానా హైకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. అధికారికంగా అనుమతించిన సంఖ్యకు మించి పోలీసు సిబ్బందిని ఎలా నియమించారో వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జగ్మోహన్ భన్సల్, అధికారిక రికార్డుల ప్రకారం హర్భజన్ సింగ్‌కు కేవలం ఎనిమిది మంది భద్రతా సిబ్బందికే అనుమతి ఉందని పేర్కొన్నారు. అయితే అదనంగా మరో 15 మంది పోలీసులను అనధికారికంగా విధుల్లోకి ఎలా పంపారో స్పష్టంచేయాలని ప్రశ్నించారు. జిల్లాల వారీగా భద్రతా సిబ్బంది కేటాయింపులపై లెక్కలు సమర్పించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు కోర్టు పేర్కొంది. ప్రస్తుతం అధికారికంగా, అనధికారికంగా ఎంతమంది పోలీసులు భద్రతా విధుల్లో ఉన్నారో పూర్తి వివరాలు సమర్పించాలని భద్రతా అదనపు డైరెక్టర్ జనరల్, మోఘా జిల్లా పోలీసు అధికారి కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వివరాలపై వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలని కోర్టు స్పష్టం చేసింది. అలాగే పిటిషనర్‌కు లేదా ఆయన కుటుంబ సభ్యులకు ఎటువంటి హాని జరగకుండా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ప్రజాధనంతో వీఐపీ భద్రత పేరిట అధిక సంఖ్యలో పోలీసులను వినియోగిస్తున్న అంశంపై కూడా కోర్టు ఆరా తీసింది. ఇక హర్భజన్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో తన భద్రతను అకస్మాత్తుగా తగ్గించారని, తనకు ఉన్న ముప్పును సమీక్షించకుండా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణను కోర్టు మే 20కి వాయిదా వేసింది.

## సోషల్ మీడియాలో కోహ్లీ హవా

### ఆడకపోయినా ధోనీ క్రేజ్ తగ్గలేదు






**ముంబై, మే 13 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ చివరి దశకు చేరుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారడంతో ప్రతి మ్యాచ్ నాకౌట్ పోరును తలపిస్తోంది. ఒకవైపు మైదానంలో ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనలతో అలరిస్తుంటే, మరోవైపు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చలు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం గుజరాత్ జెయింట్స్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బెంగళూరు జట్టు, హైదరాబాద్ జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. పంజాబ్ జట్టు కూడా 13 పాయింట్లతో రేసులో నిలిచింది. ఈ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన సోషల్ మీడియా విశ్లేషణ ఆసక్తికర చర్చకు దారితీసింది. మార్చి 28 నుంచి మే 12 వరకు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో అత్యధికంగా చర్చించబడిన క్రికెటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం చర్చల్లో 44 శాతం వాటాతో కోహ్లీ సోషల్ మీడియాను శాసిస్తున్నాడు. అతని బ్యాటింగ్‌తో పాటు మైదానంలో చూపించే దూకుడు అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. అయితే ఈ జాబితాలో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన విషయం మహేంద్ర సింగ్ ధోనీ రెండో స్థానంలో నిలవడమే. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా 21 శాతం చర్చలతో ధోనీ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా కొనసాగుతున్నాడు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే గాయంతో సీజన్‌కు దూరమైనప్పటికీ, అభిమానుల్లో ఆయనపై ఉన్న అభిమానమే ఈ స్థాయి క్రేజ్‌కు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. రోహిత్ శర్మ 18 శాతం చర్చలతో మూడో స్థానంలో నిలిచాడు. సంజూ శాంసన్ 10 శాతం, కేఎల్ రాహుల్ 8 శాతం చర్చలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మరోవైపు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. రాజస్థాన్ తరఫున ఆడుతున్న అతను కేవలం 36 బంతుల్లో సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ సీనియర్ స్టార్ ఆటగాళ్ల భారీ అభిమాన వర్గం కారణంగా టాప్ జాబితాలో చోటు దక్కలేదు. ఇదిలా ఉండగా, ధోనీపై బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ధోనీ ఆడితే చూడాలని ఉందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బన్నీతో మరోమారు పూజ




బుట్టబొమ్మ పూజా హెగ్డేకు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ప్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్.. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.

## రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది




ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాను రూ.300 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నారు. మే 18న దీని ట్రైలర్ విడుదల కానుంది. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.



## కేన్స్‌లో అలియా మెరుపులు

కేన్స్, మే 13 : ప్రపంచ సినీ, ఫ్యాషన్ అభిమానుల దృష్టిని ఆకర్షించే ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివియేరా వేదికగా జరిగిన ఈ వేడుకలో ఉదయం నుంచే కలల ప్రపంచాన్ని తలపించే అందంతో కనిపించిన అలియా.. సాయంత్రం రెడ్ కార్పెట్‌పై మరింత గ్లామ-రస్‌గా మెరిసి అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించారు. లొరియల్ పారిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా కేన్స్ రెడ్ కార్పెట్‌పై అడుగుపెట్టిన అలియా.. ప్రముఖ డిజైనర్ తమారా రాల్ఫ్ రూపొందించిన ప్రత్యేక గౌన్‌లో కనిపించారు. లేత గులాబీ రంగులో రూపొందించిన ఈ స్ట్రాప్‌లెస్ గౌన్ ఆమెకు అద్భుతమైన ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ గౌన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన నెక్‌లైన్, కార్సెట్ శైలిలో ఉన్న బాడీస్ ఆమె ఫిట్‌నెస్‌ను మరింత హైలైట్ చేశాయి. అలాగే చేతుల చుట్టూ దుపట్టా తరహాలో అమర్చిన డ్రేప్ మొత్తం లుక్‌కు భారతీయ శైలిని జోడించింది. పాశ్చాత్య ఫ్యాషన్‌లో భారతీయతను మేళవించిన ఈ డిజైన్ ఫ్యాషన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. అలియా మినిమల్ ఆభరణాలు, సాఫ్ట్ మేకప్, సాధారణ హెయిర్ స్టైల్‌తో ఎంతో రాయల్‌గా కనిపించారు. ఆమె చిరునవ్వు, ఆత్మవిశ్వాసం మొత్తం లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ప్రస్తుతం కేన్స్‌లో అలియా చేసిన ఈ స్టైల్ స్టేట్‌మెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అభిమానులతో పాటు ఫ్యాషన్ విమర్శకులు కూడా అలియా లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. భారతీయ సాంప్రదాయాన్ని ఆధునిక ఫ్యాషన్‌తో మేళవిస్తూ అలియా మరోసారి గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా తన స్థాయిని నిరూపించుకున్నారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా కేన్స్ వేదికపై భారతీయ నటీమణులు తమ ప్రత్యేక ఫ్యాషన్ స్టైల్స్‌తో ఆకట్టుకుంటుండగా.. ఈసారి అలియా భట్ తన సొగసైన రెడ్ కార్పెట్ లుక్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## రొమాంటిక్ లుక్స్‌తో ఎస్తర్ అనిల్

**హైదరాబాద్, మే 13 :** బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించి, ఇప్పుడు కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ఎస్తర్ అనిల్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ మరియు రొమాంటిక్ లుక్స్‌లో కనిపించిన ఎస్తర్ అనిల్ ఫోటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో నటిగా మంచి గుర్తింపు సంపాదించిన ఎస్తర్ అనిల్, ముఖ్యంగా 'దృశ్యం' సిరీస్ ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన మలయాళ 'దృశ్యం' చిత్రంలో అనుమోల్ పాత్రలో నటించిన ఆమె, ఆ తర్వాత అదే పాత్రను తెలుగు రీమేక్‌లో వెంకటేష్ కుమార్తెగా పోషించి తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందారు. కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఆ సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఎస్తర్ అనిల్ 2010లో విడుదలైన 'నల్లవన్' చిత్రంతో బాలనటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. అనంతరం 'దృశ్యం', 'దృశ్యం 2', తమిళంలో 'పాపనాసం' వంటి చిత్రాలతో దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. చిన్న వయసులోనే సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకు అనేక అవకాశాలు వచ్చాయి. ఇక హీరోయిన్‌గా కూడా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఎస్తర్, 'జోహార్' వంటి చిత్రాల్లో ప్రధాన పాత్రల్లో నటించారు. నటనలో ప్రతిభ కనబరిచిన ఆమెకు 2016లో ఉత్తమ బాలనటిగా కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డు లభించింది. ప్రస్తుతం లండన్‌లో మాస్టర్స్ చదువుతూనే సినిమాల్లో నటిస్తూ విద్య, కెరీర్‌ను సమతుల్యం చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉండే ఎస్తర్ అనిల్, తన కొత్త ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటుంటారు. తాజాగా విడుదల చేసిన రొమాంటిక్ స్టైల్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందం, స్టైల్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.



# అరుంధతితో స్టార్‌డమ్

## అనుష్క ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 13 : దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటీమణుల్లో అనుష్క శెట్టి ఒకరు. గ్లామర్ పాత్రలతో పాటు కథానాయిక ప్రాధాన్య చిత్రాల్లోనూ తనదైన ముద్ర వేసిన ఆమె, పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నారు. 'సూపర్' సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన అనుష్క, తర్వాత వచ్చిన 'అరుంధతి' చిత్రంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారిపోయారు. అనంతరం 'బాహుబలి' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు పొందారు. అసలు పేరు స్వీటి శెట్టి అయిన అనుష్కకు సినీ రంగంలోకి వచ్చిన తర్వాత దర్శకుడు పూరి జగన్నాథ్, హీరో నాగార్జున కలిసి "అనుష్క" అనే పేరును పెట్టినట్లు తెలిసిందే. సినిమాల్లోకి రాకముందు ఆమె యోగా శిక్షకురాలిగా పనిచేశారు. 2005లో విడుదలైన 'సూపర్' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన అనుష్క, ఆ తర్వాత దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'విక్రమార్కుడు' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2009లో విడుదలైన 'అరుంధతి' చిత్రం ఆమె కెరీర్‌కు కీలక మలుపు తిప్పింది. దర్శకుడు కోడి రామకృష్ణ రూపొందించిన ఈ ఫాంటసీ చిత్రంలో జేజమ్మ పాత్రలో అనుష్క నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు గాను ఆమెకు నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, ఫిలింఫేర్ ఉత్తమ నటి పురస్కారాలు దక్కాయి. అనంతరం 'రుద్రమదేవి', 'భాగమతి' వంటి మహిళా ప్రాధాన్య చిత్రాలతో తన ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసుకున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ పాత ఇంటర్వ్యూలో అనుష్క తన వ్యక్తిగత జీవితం, సహచర నటీనటుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తనకు ఇష్టమైన హీరోయిన్లలో త్రిష, నయనతార ఉన్నారని తెలిపారు. అలాగే నటి భూమిక చావ్లాను కుటుంబ సభ్యురాలిలా భావిస్తానని చెప్పారు. హీరోల విషయానికి వస్తే, నాగార్జున చాలా పాజిటివ్ వ్యక్తి అని, సుమంత్తో కలిసి పని చేయడం ఎంతో సౌకర్యంగా అనిపిస్తుందని పేర్కొన్నారు. తన వ్యక్తిగత బలహీనత గురించి మాట్లాడుతూ, ఫోన్‌ను తరచుగా సైలెంట్‌లో పెట్టడం వల్ల చాలాసార్లు అందుబాటులో ఉండనని, అదే తనపై ఎక్కువగా వచ్చే ఫిర్యాదని నవ్వుతూ చెప్పారు. తన జీవితంలో వచ్చిన తొలి ప్రేమ ప్రతిపాదన గురించి కూడా అనుష్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆరో తరగతిలో చదువుతున్న సమయంలో ఒక సహాధ్యాయి "నువ్వంటే నాకు ఇష్టం" అని చెప్పాడని, దానికి తాను కూడా "ఓకే" అని సమాధానం ఇచ్చినట్లు సరదాగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సినిమాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ, అనుష్కకు ఉన్న క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com